శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీ హరి




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 73 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- గురువారం 13 మార్చి 2025



- ☛రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల అమలు
- ☛రికార్డుస్థాయిలో 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి
- ☛తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉంది
- ☛గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచింది
- ☛ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు
- ☛తెలంగాణ అసెంబ్లీలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగం

## అభివృద్ధి, ప్రగతివైపు

# తెలంగాణ అడుగులు



**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు వేస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రశంసించారు. మా ప్రభుత్వం సామాజిక న్యాయం సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణకు రైతులే ఆత్మ అని, వారి అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ప్రజల కోసం నిరంతరం శ్రమించే వాళ్లే అన్నదాతలు అని జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. 260 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని ప్రశంసించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు బుధవారం ఉదయం గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగించారు. తెలంగాణ భౌగోళిక ప్రాంతమే కాదని, ఒక భావోద్వేగ ప్రాంతమని, స్థిరత్వం, దృఢ సంకల్పానికి గుర్తు తెలంగాణ అని అన్నారు. తెలంగాణ అభివృద్ధిలో రైతుల భాగస్వామ్యం ఉందని, రైతులకు మద్దతివ్వడం వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే తమ బాధ్యత అని, దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలియజేశారు. రైతులకు రుణమాఫీ చేశామని, ఇదే రైతుల పట్ల తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని, ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులకు అందిస్తున్నామని, రైతు నేస్తం అమలు చేస్తున్నామని,

వివరాలు 2లో

## ప్రభుత్వ విద్యారంగం

# తీరు అధ్వాన్నం

- ●ప్రైవేటు రంగంతో పోటీపడలేక పోతున్నారు
- ●విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నాం
- ●లెక్చరర్లు కళాశాలను తీర్చిదిద్దాలి
- ●గత పాలనలో నిరుద్యోగ సమస్య తీవ్రం
- ●అధికారంలోరి రాగానే 55 రోజుల్లో నియామకాలు
- ●ఉద్యోగ నియామకపత్రాలు అందించిన సిఎం రేవంత్



**హైదరాబాద్, 13(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలం గాణలోని ఇంటర్ కాలేజీలను గొప్పగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత జూనియర్ లెక్చరర్ల మీద ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం విద్యా రంగానికి పెద్ద పీట వేస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే తమ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు వేగంగా చేపట్టిందన్నారు. గత ప్రభుత్వం సాగదీసి నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైందని.. కానీ తాము మాత్రం 55 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశామని రేవంత్ చెప్పుకొచ్చారు. కొత్తగా ఉద్యోగాలు పొందిన 1292 మంది జూనియర్ లెక్చరర్లకు, 240 మంది పాలిటెక్నికల్ లెక్చరర్లకు రవీంద్ర భారతిలో సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పడిపోవడం ఆందోళనకరమన్నారు. కొత్తగా నియామకమైనవారు తెలంగాణ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. ఉద్యోగాలపై కోర్టుల్లో చిక్కుముడులు విప్పుతూ సమస్యలు

వివరాలు 2లో

## గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా

# గవర్నర్ ప్రసంగం

- ☛గవర్నర్ చేత అన్నీ అబద్దాలు చెప్పించాలి
- ☛పటుల ఎండుతున్నా ఎక్కడా ప్రస్తావన లేదు
- ☛మీడియా పాయింట్ వద్ద కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన 420 హామీలు ఈ ప్రభుత్వం, ఆరు గ్యారంటీల గురించి ఏమైనా కొత్త విషయాలు చెబుతారేమోనని అనుకున్నామన్నారు. 'గత 15నెలల పేలవమైన, అట్టర్‌ఎలాప్ పరిపాలన గురించి ప్రాయశ్చిత్తం చేసుకునే విధంగా గవర్నర్ ప్రసంగం ఉంటుందని భావించాం. ఇది గవర్నర్ ప్రసంగం లేదు. ఒకమాటలో చెప్పాలంటే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల ప్రెస్‌మీట్‌లా ఉంది తప్పా.. గవర్నర్ ప్రసంగంలా లేదు. గవర్నర్ నోటి వెంట ఒకటికాదు రెండు చాలా అబద్దాలు

వివరాలు 2లో



## గవర్నర్ ప్రసంగంలో

# పస లేదు

**- బిజెపి పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

**హైదరాబాద్,13(పిసిడబ్ల్యూ న్యూస్):** గవర్నర్ ప్రసంగం విజనరీ డాక్యుమెంట్‌గా ఉంటుందని ఆశించామని.. ప్రసంగమంతా పూర్తి డొల్ల అని అసెంబ్లీలో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గవర్నర్ ప్రసంగంలో వాస్తవాలు లేవని, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. చేయని పనులు

వివరాలు 2లో

# తెలంగాణలో మండే కాలం

☛ఎండల తీవ్రత పెరుగుతోంది ☛వాతావరణశాఖ హెచ్చరిక




**హైదరాబాద్,13(పిసిడబ్ల్యూ న్యూస్):** మార్చి 13 నుంచి తెలంగాణలో ఎండలు కాక పుట్టించను న్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. వేడి గాలులతో, వడగాల్పులతో వాతావరణం మార్చిలోనే మే నెల ఎండలను తలపించనుంది. హైదరాబాద్ నగరంలో పగటి పూట ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానున్నాయి. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి, యాదాద్రి, మెదక్, సిద్ధిపేట్, సిరిసిల్ల, కామారెడ్డి, జనగామ, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల వరకూ నమోదు కానుంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నారాయణ్ పేట్, వనపర్తి, గద్వాల్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుందని వాతావరణ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వేసవికాలం ప్రారంభమైన మొదట్లోనే టెంపరేచర్ 40 డిగ్రీలకు చేరువలో ఉంది. మరో రెండు నెలలు వేసవి కాలం ఉండడంతో ప్రస్తుత ఉష్ణోగతలను చూసి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎండలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గత మూడునాలుగు రోజుల నుంచి సూర్యాపేట జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు పైగా, 10 ప్రాంతాల్లో 37 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా

వివరాలు 2లో

# డిలిమిటేషన్‌పై త్వరలో అఖిలపక్షం: భట్టి



**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** నియోజకవర్గాల పునర్వి భజనపై త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి.. రాజకీయ పార్టీలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. క్యాబినె ట్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం నియోజకవర్గాల పునర్విభ జనపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలనుకుంటున్నట్లు లేఖలో పేర్కొన్నారు. 'జనాభా ప్రాతిపదికన జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో తెలంగాణకు ప్రమాదం. జరగబోయే నష్టం గురించి అన్ని పార్టీలను ఆహ్వానించి చర్చించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశానికి అన్ని పార్టీలు హాజరుకా వాలి. ప్రతి పార్టీని ప్రత్యేకంగా ఆహ్వానిస్తాం. త్వరలోనే భేటీకి సంబంధించిన తేదీ, వేదిక ప్రకటిస్తాం' అని లేఖలో పేర్కొన్నారు.



# అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి

- ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి
- సిఎల్‌పి భేటీ సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

# ప్రజావాణి సమస్యల పరిష్కారానికి కృషి

☛హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి



**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజా వాణి ద్వారా సమస్యల పరిష్కారానికి హైడ్రా చేస్తున్న కృషిని కమిషనర్ రంగనాథ్ వివరిం చారు. ఒకప్పటి చెరువుల పరిస్థితి, ఇప్పటి పట్టణీకరణ, హైడ్రా చేస్తున్న పనులపై బుధవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజావాణికి నేరుగా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ లో కూడా చాలా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్ రాబో తోందని తెలిపారు. ఎప్పటికప్పుడు ఫిర్యా దుల పరిష్కారం కోసం కృషి చేస్తు న్నా.. ఇంకా 10వేలకు పైగా పిటిష న్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.

# గవర్నర్ ప్రసంగంలో పస లేదు

(మొదటి పేజీ తరువాయి)

చేసినట్లుగా గవర్నర్ ప్రసంగం ఉందన్నారు. రైతు రుణమాఫీ పూర్తిగా జరిగిందనేది అవాస్తవం అన్నారు. ఏవీ ఇవ్వకున్నా.. అన్ని ఇస్తున్నట్లు గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 విద్యార్థినులకు స్కూటీలు ఇచ్చారా? అని నిలదీశారు. అబద్దాల పునాదుల మీద ప్రసంగం ఉందని.. నిరుద్యోగ సాధికారిత అని మోసపూరిత మాటలు గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచారని విమర్శించారు. బీఏసీలో సమస్యలపై చర్చకు ఎక్కువ రోజులు చర్చించేందుకు అసెంబ్లీ నడవాలని కోరామన్నారు. కేవలం ఐదురోజుల్లో ప్రజా సమస్యలపై, బిల్లులపై చర్చ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు.

# తెలంగాణలో మండే కాలం

(మొదటి పేజీ తరువాయి)

బోరుబావుల్లో నీరు తగ్గిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో సాధారణంగా 35 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ మార్చి రెండో వారంలోనే 35 డిగ్రీలకు చేరుకొని ఆ తర్వాత 40కి అటు ఇటుగా నమోదవుతుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మార్చి 4న 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అంతకుముందు వారం రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు ఉన్నాయి. ఈనెల 1న 33 డిగ్రీలు, 2న 35 డిగ్రీలు, 3న మరో రెండు డిగ్రీలు పెరిగి 37కు చేరింది. ఈనెల 4న ఏకంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బుధవారం నాలుగు మండలాల్లో 38.03 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఎండాలను చూస్తున్న జనం రానున్న రోజుల్లో ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

# 27 వరకు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- 19న బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న భట్టి
- బిఎసి సమావేశంలో నిర్ణయం

**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** 19న తెలంగాణ బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉండనుంది. 14న హోలీ సందర్భంగా అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. 17, 18 తేదీల్లో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ నెల 27 వరకు బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 21 నుంచి 26 వరకు పద్దులపై చర్చ ఉండనుంది.

# శ్రీచైతన్యలో మూడోరోజూ దాడులు

**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీ చైతన్య విద్యా సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు తనిఖీలు మూడో రోజూ కొనసాగాయి. విద్యా సంస్థల అధినేత బొప్పన సత్యనారాయణ రావు, ఆయన కుటుంబసభ్యుల నివాసాల్లో ఐటీ అధికారుల సోదాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా ఆయన కుమార్తెలైన బొప్పన సుష్మ, బొప్పన సీమ ఇళ్లలో కూడా ప్రత్యేక దర్యాప్తు జరుగుతోంది. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 32, రోడ్ నెంబర్ 10లో ఉన్న బొప్పన సుష్మ, బొప్పన సీమ నివాసాల్లో ఐటీ అధికారులు మరింత తీవ్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి కీలక ఆధారాలను సేకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇది ఇలా ఉండగా, సోదాల సమయంలో ఇద్దరు డైరెక్టర్లు అందుబాటులో లేకపోవడం గమనార్హం. వారిరివురు వచ్చిన తర్వాత ఐటీ శాఖ మరోసారి వారి నివాసాల్లో తనిఖీలు నిర్వహించే అవకాశముందని సమాచారం. విద్యా సంస్థల ద్వారా ఆదాయపు పన్ను మోసం చేసి, ఆ నిధులను మరొకచోటికి మళ్లించారని అనుమానం నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఆస్తులపై మరిన్ని దర్యాప్తులు కొనసాగనున్నట్లు తెలుస్తోంది.విద్యా రంగంలో పేరొందిన సంస్థపై ఈ స్థాయిలో ఐటీ దాడులు జరగడం గమనార్హం. అధిక మొత్తంలో ఆదాయపు పన్ను ఎగవేశారని, ఆ నిధులను ఇతరత్రా మార్గాల్లో మళ్లించారని అనుమానంతో అధికారులు జాగ్రత్తగా అన్ని లావాదేవీలను పరిశీలిస్తున్నారు. సోదాల అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# సోషల్ మీడియాలో రేవంత్‌పై దుష్ప్రచారం

**- ఇద్దరు యూట్యూబర్లను అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, 13(పిసిడబ్ల్యూ న్యూస్):** సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన ఇద్దరు యూట్యూబర్‌లను పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను సైబర్ క్రైమ్ అదనపు సీపీ విశ్వప్రసాద్ మీడియాకు వెల్లడించారు. 'నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ ఫిర్యాదు చేశారు. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశ పూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని దర్యాప్తులో గుర్తించాం. పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేశారు. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానెల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను అరెస్ట్ చేశాం. టీవీ కార్యాలయంలో సోదాలు నిర్వహించి రెండు ల్యాప్ టాప్‌లు, రెండు హార్డ్ డిస్క్‌లు, ఒక లోగో, ఒక రూటర్, 7 సీపీయూలు స్వాధీనం చేసుకున్నాం. రేవతిపై గతంలో బంజారాహిల్స్, ఎల్‌బీనగర్‌లో కేసులు ఉన్నాయి' అని అదనపు సీపీ విశ్వప్రసాద్ తెలిపారు.

# అభివృద్ధి, ప్రగతివైపు తెలంగాణ అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

వరికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నామని, రైతుల కోసం వ్యవసాయ కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. గేమ్‌ఛేంజర్‌గా మహాలక్ష్మి పథకం నిలిచిందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి కల్పిస్తున్నామని జిష్ణుదేవ్ వర్మ వివరించారు. ఘనమైన సంస్కృతి నిలయం తెలంగాణ అని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల కోసం గద్దర్, అంజయ్య వంటి ఎందరో కృషి చేశారన్నారు. జననీ జయకేతనం రాష్ట్ర గీతంగా చేసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరించుకున్నా మన్నారు. తెలంగాణ ప్రజల కలల సాకారానికే ఈ బడ్జెట్ అని అన్నారు. ప్రజలే కేంద్రంగా పాలన కొనసాగుతోందని గవర్నర్ వెల్లడించారు. ల్గ÷తులకు మద్దతివ్వడం, వారిని శక్తిమంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. దేశంలోనే ధాన్యం పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని అన్నారు. రైతులకు రుణమాఫీ చేశామని.. ఇదే రైతుల పట్ల చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 23.35 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పించామని తెలిపారు. ప్రజలే కేంద్రంగా పాలన సాగుతోందని, రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు, మహిళలు, యువతకు అన్ని విధాలా సహకారం అందిస్తామని చెప్పారు. రైతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఘనమైన సంస్కృతికి నిలయం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ పురోగమించడమే కాదు.. రూపాంతరం చెందుతోందన్నారు. సమ్మిళిత, స్వయం సమృద్ధి, సాధికార తెలంగాణ విజన్‌తో పని చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సమృద్ధికి దిక్సూచిగా ఉండేలా తెలంగాణ నమూనా ఉండాలని, తెలంగాణ భౌగోళిక పాత్రమే కాదు.. ఒక భావోద్వేగమన్నారు. తెలంగాణ స్థిరత్వం, దృఢసంకల్పానికి గుర్తు అన్నారు.రైతుల స్వేదం, కష్టం మన ప్రజలను పోషిస్తోందన్నారు. 260లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తితో దేశంలోనే తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఇది మన రైతుల స్థిరత్వం, అంకిత భావానికి ఓ సాక్ష్యమన్నారు. రూ.2లక్షల పంట రుణమాఫీని అమలు చేస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం చేసిన వాగ్దానాల నిర్దిష్ట కాల అమలుకు సాక్ష్యమన్నారు. రైతు భరోసా కింద నేరుగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా యువతకు సాధికారత లభిస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అగ్రశ్రేణి శిక్షణ అందుతోంది. సివిల్ సర్వీసు పరీక్షల ఆశావహుల కోసం రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం తెచ్చాం. గతేడాది 55 వేల మందిగా పైగా యువత పభుత్వోద్యోగాలు పొందారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ రూ.10 లక్షల వరకు పెంచాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లు ప్రతిపాదించాం. ఎస్సీ ఉపవర్గీకరణ కోసం బిల్లును ప్రవేశపెట్టనున్నామని గవర్నర్ అన్నారు. గవర్నర్ ప్రసంగం అనంతరం శాసనసభ గురువారానికి వాయిదా పడింది. సమావేశాలకు ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు నిరసనలు వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ విద్యారంగం తీరు అధ్వాన్నం

(మొదటి పేజీ తరువాయి)

పరిష్కరిస్తున్నా మన్నారు. తెలంగాణలో ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలతో గవర్నమెంట్ విద్యాలయాలు పోటీ పడలేకపోవడం బాధాకరం అన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో చదువు చెప్పే వారికన్నా గవర్నమెంట్ లెక్చరర్లకే ఎక్కువ నాలెడ్జ్ ఉందని.. అయినా రిజల్ట్ వారికంటే తక్కువ రావడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రైవేట్ సంస్థలకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీలను తీర్చి దిద్దాలని చెప్పుకొచ్చారు. ఒక ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగం వస్తే..ఆ కుటుంబ భవిష్యత్ మారిపోతుందని.. వారి కష్టాలన్నీ తొలగిపోతాయని వివరించారు. భవిష్యత్ లో మరిన్ని నోటిఫికేషన్లు ఇచ్చి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడటంలో నిరుద్యోగుల పాత్ర కీలకం అని గుర్తు చేశారు.ఉద్యోగ బాధ్యతలు చేపడుతున్న వారికి సీఎం అభినందలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాటల ప్రకారం 57,946 ఉద్యోగ నియామకాలు చేపట్టామని గర్వంగా చెబుతున్నామన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అయినా మొదటి సంవత్సరంలోనే 50 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు చేపట్టిన రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో అభివృద్ధి పథంలో నడిస్తే భవిష్యత్‌తరాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి నిరుద్యోగం కూడా ఒక కారణమన్నారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులది కీలకపాత్ర అని చెప్పుకొచ్చారు. కేసీఆర్ కుటుంబంలో ఉద్యోగాలు పోవడం వల్లే ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 50 వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని తెలిపారు. దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని గ్రహించాలన్నారు. 55 రోజుల్లోనే 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేశామన్నారు. విద్యార్థులపై ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదని.. అది వారి భవిష్యత్‌కు పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచాలని తెలిపారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలు పెంచేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మించబోతున్నామన్నారు. ఇటీవలే 55 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.11000 కోట్లు కేటాయించామని తెలిపారు. విద్యార్థి, నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. చదువుతో పాటు సాంకేతిక నైపుణ్యం ఉండాలన్నారు. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రపంచానికే తెలంగాణ నుంచి ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడలు మన దేశ ప్రతిష్టను పెంపొందిస్తాయని చెప్పుకొచ్చారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామన్నారు. బాక్సర్ నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామన్నారు. పారాలింపిక్స్ క్రీడాకారిణి దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం ఇచ్చామని అన్నారు. కొంతమంది స్ట్రెచర్ స్ట్రెచర్ అని మాట్లాడుతున్నారని.. స్ట్రెచర్ ఉందని విర్రవీగినవారు స్ట్రెచర్ మీదకు వెళ్లారన్నారు. స్ట్రెచర్ అనేది స్థానానికి తప్ప వ్యక్తులకు ఉండదని తెలిపారు. కేసీఆర్ తమకు వారసత్వంగా ఇచ్చింది అప్పులు, తప్పులు మాత్రమే అని అన్నారు. ప్రతీ నెలా రూ. 6500 కోట్లు కేసీఆర్ చేసిన అప్పులు తప్పులకే సరిపోతుందన్నారు. రాష్ట్రానికి కేసీఆర్ ఆర్థికంగా క్యాన్సర్ ఇచ్చారని.. క్యాన్సర్ ముదురుతుంటే రాష్ట్రం దివాళా తీసిందంటారా అని అంటున్నారని.. వాస్తవాన్ని ఎన్నాళ్ళు దాచిపెడతారని అన్నారు. తాను వాస్తవాలు చెబుతుంటే? దిగిపో దిగిపో అని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబం మొత్తం ఫ్యామిలీ ప్యాకేజ్‌లా అబద్దాలు మాట్లాడుతున్నారన్నారు. 'అబద్దాల ప్రాతిపదికన తాను రాష్ట్రాన్ని నడపను. వాస్తవాలు మీతో పంచుకుని రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తా. తెలంగాణలో భావితరాల భవిష్యత్ నిర్మాణానికి మీ సహకారం అవసరం. ఎంతసేపు సీఎం కుర్చీని లాక్కుంటామంటే ఎలా.. నన్ను పనిచేయనివ్వాలి కదా మీరు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, కేశవరావు, మేయర్ గద్వాల విజయలక్ష్మి, సిఎస్ శాంతికుమారి, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో ప్రెస్‌మీట్‌లా గవర్నర్ ప్రసంగం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పించారు. గవర్నర్ నోటివెంట అసత్యాలు పలకాల్సి రావడంపై బాధపడుతున్నాం. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్ల ఈ రోజు రాష్ట్రంలో రైతాం గం ఆందోళనలో ఉందని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతు న్నయ్. ఇప్పటికే 480 పైచీలుకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కనీసం ఒక మాట రైతులకు స్వాంతన చేకూర్చే, ఉపశమనం, భరోసా ఇచ్చేమాట గవర్నర్ నోటినుంచి వస్తుందే మోననని ఆశించాం. పంటలు ఎండిపోకుండా కాపాడుతాం. పంటలకు నీరు ఇస్తాం. బుద్ధి తెచ్చుకున్నాం. ఇకనైనా బుద్ధితో మెదులుతామని చెప్పి ఒక్క మాట చెబుతారని అనుకున్నాం. వారి నోటివెంట ఒక్క మాట రాలేదు. అసలు ఈ రోజు వరకు రాష్ట్రంలోని ఏ గ్రామంలో కూడా 25శాతం నుంచి 30శాతానికి మించి రుణమాఫీ జరుగలేదు. దీనిపై పోయిన శాసనసభలో ప్రభుత్వాన్ని అడిగినం. సీఎం సొంత ఊరికి పోదామా? సొంత నియోజకర్గానికి పోదామా? ప్లేస్, సమయం మీ ఇష్టం.. ఊరు మీష్టం అని చెప్పాం. ఒక ఊరిలో వందశాతం రుణమాఫీ జరిగితే మేం అందరం రాజీనామా చేస్తామని చెప్పాం. కానీ, మళ్లీ ఈ రోజు గవర్నర్ నోటివెంట రుణమాఫీ అయిపోయింది.. లక్షలాది మంది రైతులు సంతోషంగా ఉన్నరని గవర్నర్‌తో అబద్దాలు చెప్పించి.. గవర్నర్ స్థాయిని సైతం దిగజార్చి మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం తన భ్రష్టత్వాన్ని, నీచత్వాన్ని బయటపెట్టుకుంది' అంటూ కేటీఆర్ మండిపడ్డారు. పెట్టుబడి సాయం అందని రైతులు, రుణమాఫీ కాక.. కేసీఆర్ హయాంలో ఉన్న రైతుబంధును సైతం కనీసం అమలు చేసే పరిస్థితి లేక ఆగమాగమైపోతుంటే.. రైతుబంధు మొత్తం అందింది.. అది మాత్రమే కాకుండా రైతు కూలీలకు సహాయం చేస్తున్నామని గవర్నర్ నోటి వెంట అబద్దాలు చెప్పించడమంటే గవర్నర్‌కు కూడా అవమానం. గవర్నర్ దీన్ని గుర్తించాలి. సాగునీటి సంక్షోభం రోజురోజుకు తీవ్రమవుతుంది. కేసీఆర్‌పై ద్వేషంతో, బీఆర్ఎస్‌పై గుడ్డి కోపంతో మేడిగడ్డకు మరమ్మతులు చేయకుండా 15నెలలు ఎండపెట్టడం వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలో ఎండిపోతున్న ప్రతి ఎకరా పంటకు బాధ్యత తీసుకోవాల్సింది రేవంత్‌రెడ్డి అనే ఈ ముఖ్యమంత్రి. రేవంత్‌రెడ్డి అనే చేతగాని ముఖ్యమంత్రి వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. పంట ఎండిపోయి రైతులు అవస్థలుపడుతున్న రైతులు.. పంటలకు నిప్పుపెట్టుకుంటున్నరు రైతులు, పొలాల్లో గొర్రెలు మేకలను మేపుతున్న రైతులు గవర్నర్ ప్రసంగం నుంచి ఒక్క మాట కోసం ఇవాళ ఎదురుచూశారు. మేం పంటలు ఎండిపోకుండా కాపాడుతాం.. మేం ఉన్నాం.. ఈ ప్రభుత్వం మీకు భరోసా ఇస్తుంది. మేడిగడ్డను రిపేర్ చేస్తాం. ఇన్నిరోజులు కేసీఆర్‌పై కోపంతో తప్పు చేశామని ప్రాయశ్చిత్తం చేసుకుంటరనుకున్నామని.. కానీ, ఆ సోయి ఈ ప్రభుత్వానికి లేదు. కనీసం ఒక మాట మాత్రంగా కూడా ఎండుతున్న పంటలు, సాగునీటి సంక్షోభం.. 480 మంది రైతుల ఆత్మహత్యలపై ఒక్కమాట మాట్లాడకపోవడం అంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యతలు ఎట్ల ఉన్నయో దీన్ని బట్టే తెలుసుకోవచ్చని అంటూ కేటీఆర్ విమర్శించారు.

# అసెంబ్లీ సమావేశాలకు విధిగా హాజరు కావాలి

- ప్రతి విషయంలోనూ అవగాహనతో ఉండాలి
- విపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలి
- సిఎల్‌పి భేటీ సిఎం రేవంత్ స్పష్టమైన ఆదేశాలు

**హైదరాబాద్,మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** అసెంబ్లీ సమావేశాలకు అందరు ఎమ్మెల్యేలు తప్పనిసరిగా హాజరు కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతిపక్షాలు గందరగోళం చేసే ప్రయత్నం చేస్తాయని, సంయమనంతో వ్యవహరించాలని సీఎం సూచించారు. అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని పలు సూచనలు చేశారు. సభలో వ్యవహరించాల్సిన విధానంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజా ప్రభుత్వంలో ఇవి రెండో పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలని, అత్యంత కీలకమైనవిగా సీఎం స్పష్టం చేశారు. ఈ 15నెలల్లో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై పూర్తిగా చర్చించుకునేందుకు ఈ సమావేశాల్లో అవకాశం ఉందన్నారు. సభ్యులందరూ కచ్చితంగా రావాల్సిందేనని, ప్రతిపక్షాల విమర్శలను ధీటుగా ఎదుర్కోవాలన్నారు. సమావేశాల్లో సభ్యులంతా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అంశాల వారీగా ప్రిపేర్ అయి సభకు రావాలని తెలిపారు. సభ్యుల హాజరుపై ప్రభుత్వ విప్‌లు పర్యవేక్షించాలని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా సీఎం అసహనం వ్యక్తం చేశారు. హాజరైతేనే సభలో ఏం జరుగుతుందో తెలుస్తుందన్నారు. సీఎల్పీ భేటీలో మాట్లాడుతుండగా బయటకు వెళ్లిన నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్‌పై సీఎం అసహనం వ్యక్తం చేశారు. కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. 'చాలామంది సీరియస్ గా పనిచేయట్లేదు. ఒకసారి గెలవడం గొప్పకాదు.



మరోసారి అసెంబ్లీకి రావడమే గొప్ప. చాలా మంది బీఆర్ ఎస్ పట్ల సైలెంట్ గా ఉంటున్నారు. అలా చేస్తే మీ మీద అభ్యర్థిని పెట్టరు అనుకుంటున్నారా.. అలా అస్సలు ఊహించుకోకండి. వాళ్ల గురించి నాకు బాగా తెలుసు. రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత అన్నింటికీ ధైర్యంగా ముందుకెళ్లాలి' అంటూ చెప్పుకొచ్చారు సీఎం రేవంత్.మీటింగ్ మధ్యలో నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ బయటకు వెళ్లడంపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారు. 'ఓ వైపు నేను ఇంత సీరియస్ గా మాట్లాడుతుంటే అతనేంటి అలా వెళుతున్నారు. ఇంత నాన్ సీరియస్ గా ఉంటే ఎలా.. మనం మరోసారి గెలవాలంటే చాలా సీరియస్ గా పనిచేయాల్సిందే. రాజకీయాలు అంటే పిల్లలాటలు కాదు. అందరం కలిసి పనిచేస్తేనే మరోసారి మన ప్రభుత్వం వస్తుంది. కొందరి వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు రావొద్దు. ఇక నుంచి అందరూ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండాలి. వచ్చే నెల 6వ తేదీ నుంచి అన్ని జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి లంచ్ మీటింగ్ పెట్టుకుందాం. అందరి పనితీరుపై చర్చిద్దాం' అంటూ సీరియస్ గా క్లాస్ తీసుకున్నారు.

# రాష్ట్ర స్థాయి యు-14 బాలుర ఫుట్ బాల్ పోటీలకు శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి




**మహబూబాబాద్, మార్చ్ 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇటీవల డోర్నకల్ బిషప్ గ్రౌండ్ లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకి దార్ల.సూరజ్ వర్ధన్ ఎంపికైనట్లు శ్రీ చైతన్య టెక్నో స్కూలు ప్రిన్సిపాల్ దాసరి మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుండి 16 వరకు మహబూబ్ నగర్ జిల్లా వనపర్తి లో జరగపోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటున్నట్టు, ఆ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి ఎంపిక కావాలని, అదే విధంగా తల్లిదండ్రులకు, పాఠశాలకి, జిల్లాకి మంచి పేరును తీసుకొని రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీన్ నరేష్ , సి - ఇంచార్జ్ లక్ష్మి నారాయణ, ఉపాధ్యాయ బృందం విద్యార్థి సూరజ్ వర్ధన్ ను మరియు పిఈటీ యాకన్నని అభినందించారు.

# శివనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ




**హనుమకొండ, మార్చి 12(పి సి డబ్ల్యూ న్యూస్):** శివనగర్ లోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం నిర్మించుట కొరకు నిర్మాణం చేయు స్థలంలో భూమి పూజ ( ముగ్గుపోయి కార్యక్రమం) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, మేకల రవి, గంట రవికుమార్, లికొత్తపెల్లి శ్రీనివాస్ విగ్రహ దాత రేణుకుంట్ల రవీందర్, ఫౌండేషన్ దాత మెరుగు అశోక్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పోలేపాక నరేంద్ర, డి హెచ్ పి ఎస్ అధ్యక్షులు ఏలెందర్ సింగిరెడ్డి ఉపేందర్ చింతల నవీన్ కొత్తూరు రాజు, బాల్య కుమార్, పిట్టల ఎంకన్న, జన్ను గోవర్ధన్, విగ్రహ కమిటీ అధ్యక్షులు రేణుకుంట్ల శివకుమార్ శివనగర్ గ్రామ పెద్దలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి చందాలు ఇచ్చినటువంటి దాతలు, రాజకీయ పార్టీలకతీతంగా శివనగర్ లో ఉన్నటువంటి అందరూ కూడా పాల్గొనడం జరిగింది.

# 16న జరిగే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

- నియోజకవర్గ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలకాలి
- 16వ తేదీన రూ. 800కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన




**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** 16వ తేదీన జరిగే ముఖ్యమంత్రి సభను ప్రతీ ఒక్కరు తమ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని కేఎన్ఎన్ ఫంక్షన్ హాల్లో రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుండి జన సమీకరణ వివరాలను గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ. 800కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంజూరు ఇచ్చి వాటి శంకుస్థాపనకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి మొదటి సారిగా వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి పెద్ద ఎత్తున జన సమీకరణతో ఘన స్వాగతం పలకాలని తెలిపారు. ఈ సభ లో నియోజకవర్గ అభివృద్ధికి సీఎం తో మరిన్ని ఎక్కువ నిధులు మంజూరు తెచ్చుకోవాలని అన్నారు. కావున ప్రతీ ఒక్కరూ సభ జయప్రదం కావడానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలు అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి అధికారం కోల్పోయే సరికి కడుపు మండుతోందని అన్నారు. కేటీఆర్, హరీష్ రావు, కవితలు ప్రభుత్వంపై అక్కసుతో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇక కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు పేరుకే కేంద్ర మంత్రులని వారు ఢిల్లీ లో కంటే హైదరాబాద్ లోనే ఎక్కువగా ఉంటారని, వీరు తెల్లారి లేస్తే ప్రెస్ మీట్లు పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడమే వీరి పని ఏద్దేవా చేశారు. అందుకే వారిని దద్దమ్మలు అంటున్నానని అన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ లు సోషల్ మీడియాలో చేసే విష ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నేటి కిసాన్ మోర్చా ధర్నాను జయప్రదం చేయండి



**బయ్యారం, మార్చి 13(పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్రంలో ఉన్న మోడీ సర్కార్ రైతాంగానికి లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతు వ్యతిరేక, కార్పొరేట్ కు అనుకూల మూడు నల్ల చట్టాలను ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటించి మరోసారి దొడ్డిదారిన నూతన జాతీయ మార్కెటింగ్ వ్యవసాయ విధానం పేరుతో రైతాంగానికి వ్యవసాయాన్ని దూరం చేసే విధానాలను తీవ్రతరం చేస్తూ. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు. బడా వ్యాపారవేత్తలకు కట్టబెట్టే విధానాలను కొనసాగిస్తుందని ఈ విధానాల వల్ల దేశ ప్రజలు రైతులు కార్మికులు అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటు తీవ్రంగా నష్టపోతున్నారని అఖిల భారత రైతు- కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించారు. రాష్ట్ర. కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు -కార్మిక-ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తు ఢిల్లీ సరిహద్దుల్లో సంవత్సరం పైగా రైతాంగ పోరాటాన్ని నిర్వహించిన ఫలితంగా మోడీ సర్కార్ రైతాంగానికి క్షమాపణ చెప్పి ఒక సంవత్సరం కాలంలో రైతాంగ సమస్యలు పరిష్కరిస్తానని లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడం జరిగింది. నేటికీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా రైతాంగ. కార్మిక ప్రజా ఉద్యమాలను అణిచివేయుటకు కుటిల ప్రయత్నాలు కొనసాగిస్తుందని వారన్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న 4 లేబర్ కోడ్స్ వల్ల కనీస వేతనం- ఉద్యోగ భద్రత-సామాజిక భద్రత-ఎనిమిది గంటల పని దినం- ట్రేడ్ యూనియన్ హక్కుల వంటి హామీలను రద్దు చేస్తున్నారు.ఈ నాలుగు లేబర్ కోడ్ ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు సంవత్సరాలుగా పోరాడుతున్నాయి. రైతాంగం అన్ని పంటలకు మద్దతుధర కల్పిస్తూవ్యవసాయ ఖర్చులకు 50 శాతం అదనంగా జోడించి చట్టం చేయాలని రైతులకు రుణ విముక్తి చట్టం చేయాలని. పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని అనేక సంవత్సరాలుగా రైతులు పోరాడుతున్నారు. వీటి అమలు కోరుతూ. కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న.రైతు.కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ హైదరాబాదులో ఇందిర పార్క్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని రైతాంగాన్ని. కార్మిక వర్గాన్ని కోరుతున్నామని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు కోరారు.

# శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి




**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** చిల్పూర్ మండల కేంద్రంలోని చెల్పూర్ గుట్ట శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారి కల్యాణ మహోత్సవానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యే కి పూర్ణ కుంభంతో, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే స్వామి వారి కల్యాణ వేడుకను వీక్షించారు. ఆలయ అర్చకులు స్వామి వారికీ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనలు అందజేశారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చిల్పూర్ శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి వారి ప్రశస్త్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఈవో, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభా ఏర్పాట్లపై సభ స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హనుమకొండ, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 16న నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై పాలకుర్తి రోడ్ శివునిపల్లి లోను సభా స్థలాన్ని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా, అదనపు కలెక్టర్లు, డీసీపీ లతో కలిసి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సభా ఏర్పాట్ల పై అదకారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రధాన సభా వేదిక ఎక్కడ ఉండాలి, హెలిప్యాడ్ ఎక్కడ ఏర్పాటు చేయాలి, శంకుస్థాపనలకు సంబందించిన శిలాఫలకాలు ఎక్కడ ఏర్పాటు చేయాలి, మహిళా సంఘాలకు అందించనున్న ఆర్టీసీ బస్సులు ఎక్కడ ఉంచాలి, సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సీటింగ్ ఏర్పాటు ఎలా చేయాలి, వివిఐపీ, మీడియా గ్యాలరీ ఏర్పాటు, వివిఐపీ పార్కింగ్ ఎక్కడ ఉండాలి, హెలి ప్యాడ్ నుండి సీఎం కాన్వాయి ఏ రూట్ లో రావాలి అనే



అంశాలపై అధికారులతో కులాంకుశంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభకు వచ్చేందుకు ప్రజలు చాలా ఉత్సాహంగా ఉన్నారని 50వేల పైచిలుకు ప్రజలు సభకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటి వాటిని అందరికి అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనియా సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని, అలాగే ఎక్కడా కూడా ట్రాఫిక్ ఇబ్బందులు తలేత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం వరకు సభ ఏర్పాట్లు పూర్తి కావాలని అధికారులకు సూచించారు. ఆయా శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు, వివిధ శాఖల ఎస్ఈలు, డీఈలు, జిల్లా అధికారులు, ఏసీపీలు, సిఐలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వంటచేయలేదని భార్యను చంపిన భర్త




**సీరోల్, మార్చి 12( పిసిడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలో బూరుగు చెట్టు తండా గ్రామపంచాయతీ మంజా తండా మంగళవారం రాత్రి సుమారు పదకొండు గంటల సమయంలో వంట చెయ్యలేదని మాలోతు కళావతి సుమారు( 30) సంవత్సరాలు భర్త బాలు తీవ్రంగా కొట్టడంతో మృతి చెందడం జరిగింది దీంతో మృతురాలి తల్లి లక్ష్మి సీరోల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చెయ్యగా వెంటనే ఎస్ఐ సిహెచ్ నగేష్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# గార్లకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు కల్పించండి

### - ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కి అఖిల పక్షం వినతి



**గార్ల, మార్చ్12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రమైన గార్ల, చుట్టుపక్కల గ్రామాలకు మహబూబాబాద్ జిల్లా నుండి బస్సు సౌకర్యం లేనందున ప్రయాణికుల సౌకర్యార్థం వెంటనే పలు విధాల బస్సులు గార్ల మండల కేంద్రంగా కల్పించాలని అఖిలపక్షం గ్రామ పెద్దల, పలు రాజకీయ నాయకుల తరపున కార్గో సేవలు కార్యక్రమానికి ఆర్టీసీ ఆర్ ఎం మేనేజర్ రామారావు, సంబంధిత అధికారులు వచ్చిన సందర్భంగా వినతిపత్రం అందజేశారు. రీజినల్ మేనేజర్ రామారావు స్పందించి సంబంధిత డిపో మేనేజర్ తో ఫోన్ ద్వారా విషయాలను తెలియపరచి వెంటనే మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ తరపున రామయ్య వేలాద్రి నరేందర్ శివకుమార్ తదితర సంబంధిత అధికారులు కార్గో సేవల తరపున అప్పిరెడ్డి, నాగబాబు, తదితరులు పాల్గొన్నారు.

# వన్నాల విజయలక్ష్మికి నివాళు లర్పించిన టి-పిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు



**హనుమకొండ, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ హంటర్ రోడ్డు డి- కన్వెన్షన్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు సతీమణి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ తల్లి గారైన వన్నాల విజయలక్ష్మి దశదిన కర్మ కార్యక్రమానికి టి-పిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చైర్మన్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# సీలింగ్ ఫ్యాన్ పడి విద్యార్థినికి గాయాలు...

**కరీంనగర్ టౌన్ మార్చి 12(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని సహస్ర జూనియర్ కాలేజీలో ఇంటర్ సెంకడియర్ పరీక్ష రాస్తుండగా విద్యార్థినిపై సీలింగ్ ఫ్యాన్ పడి గాయాలయ్యాయి. ఈ ఘటనలో నీలి శివాన్విత అనే ఇంటర్ సెంకడియర్ విద్యార్థిని పరీక్ష రాస్తోంది. ఈక్రమంలో సీలింగ్ ఫ్యాన్ ఆమె తలపై పడడంతో ముఖానికి గాయాలయ్యాయి. నిర్వాహకులు ప్రథమ చికిత్స చేసి పరీక్షను వ్రాయించారు.



# గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** గురుకులాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూరిబా విద్యాలాయాల్లో ఫుడ్ సేఫ్టీ, వసతుల కల్పన, ఇతర అభివృద్ధి పనుల పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మొత్తం 110 గురుకులాలు ఉన్నాయని, భోజనం, ఇతర వసతులను జిల్లా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారని జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్ కలెక్టర్ కు వివరించారు. గురుకులాల్లో తాగునీరు, టాయిలెట్స్, మెష్ డోర్స్, కాంపౌండ్ వాల్స్, ఇతర మౌలిక వసతుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వివిధ గురుకులాల్లో సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికీ తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గురుకులాల్లో కల్పిస్తున్న వసతుల పై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గురుకులాల్లోని అన్ని వసతులు బాగుండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గురుకుల విద్యాలయాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదన లను సిద్ధం చేసి అందించాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులకు అందించే భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని, బియ్యం, పాలు, కూరగాయలు, ఇతర సరకులు నాణ్యతగా ఉండాలన్నారు. మైనర్ రిపేర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా గురుకు లాలకు నీటి సరఫరా జరగాలన్నారు. సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు పరిశు భ్రత, టాయిలెట్ల నిర్వహణ బాగుండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డిఈవో వాసంతి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమరయ్య, పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ గురుకులాల అధికారులు పాల్గొన్నారు.





## పెళ్ళి బంధంతో ఒకటైన మూగ జంట....పలువురికి ఆదర్శం

**గార్ల, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** మండల కేంద్రం లోని వర్తక సంఘం భవనంలో బుధవారం మూగ జంటకు కుటుంబ సభ్యులు,బంధువులు సాంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా వివాహాన్ని జరిపించారు. వివరాల లోకి వెళ్తే మండల కేంద్రానికి చెందిన సంగు నాగేంద్ర పవన్ కుమార్- ఉమావతి దంపతుల కుమారుడు సంగు అశ్విన్ సాయి (మూగ యువకుడు), అంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లాలో బలుసుతిప్పా గ్రామానికి చెందిన కోప్పాడి సత్యనారాయణ- రామోజీ దంపతుల కుమార్తె కొప్పాడి బుజ్జి (మూగ యువతి) మాట్రిమోనీ ద్వారా పరిచయమై వివాహం చేసుకొని పలువురి కి ఆదర్శంగా నిలిచారు.ఈ వివాహానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, పలు జిల్లాలలోని మూగ యువతీ,యువకులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలలో పాల్గొన్న సుడా చైర్మన్





**కరీంనగర్ రూరల్,మార్చ్12 (పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లి లో జరిగిన శ్రీ రేణుకా ఎల్లమ్మ పట్నాలలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి నియోజక వర్గ ఇంచార్జ్ పురుమల్ల శ్రీనివాస్ తో కలిసి పాల్గొన్నారు.గౌడ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ మల్లేశం గౌడ్,ఉపాధ్యక్షుడు బుర్ర గంగయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ పట్నాలు ఆదివారం రోజు ప్రారంభమై బుధవారం పెద్దపట్నం మరియు ఎల్లమ్మ మునిరాజ్ ల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగాయి.సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని గౌడ సంఘం నాయకులు గ్రామస్తులు డప్పు సప్పుళ్లతో ఆహ్వానించి శ్రీ రేణుక ఎల్లమ్మ పసుపు బొట్టుపెట్టి సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి,గౌడ సంఘం డైరెక్టర్లు బండపల్లి కొమురయ్య గౌడ్,కైరి నారాయణ గౌడ్, వడ్లకొండ నారాయణ గౌడ్, భూసారపు కొమురయ్య గౌడ్,బత్తిని శ్రీనివాస్ గౌడ్,గుర్రం ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** గంజాయి కేసును ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి డబ్బాలు, గుడ్ల సింగారం ఏరియాలో కే యూ సి పోలీసుల ఆధ్వర్యంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. ఓ ఆర్ ఆర్ దగ్గర పెగడపల్లి క్రాస్ చేరుకోగానే.., పోలీస్ రాకను చూసి ఒక వ్యక్తి పారిపోతుండగా అతని పట్టుకొని విచారించగా, అతని వద్ద నుండి 3.200 గ్రాముల గంజాయి ని, పులుకుర్తి, దామెర ప్రాంతానికి చెందిన దుప్పటి ప్రవీణ్(30) తండ్రి మల్లయ్య, వద్ద నుండి స్వాధీన పరుచుకుని, విచారించగా.., పబ్లిక్ గార్డెన్ వద్ద ఒక మహిళ వద్ద నుండి కొనుక్కొని, రైల్వే స్టేషన్స్, ఖాళీల ప్రాంతాలలో అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నాడని, అతని వద్ద నుండి సెల్ ఫోన్, ద్విచక్ర వాహనం, గంజాయి స్వాధీనం చేసుకొని సీజ్ చేసి, దుప్పటి ప్రవీణ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.



## టెక్నాలజీ డిప్లొమా కోర్స్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**హనుమకొండ, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజి (IIHT) హైదరాబాదు నందు మొదటి సంవత్సరము (2025-26) నకు (60) సిట్లకు చేనేత, టెక్స్ టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్స్ లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానించ బడుచున్నవని, చేనేత, జౌళి శాఖ. సహాయ సంచాలకులు, ఎమ్.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నందు నూతనముగా మంజూరు కాబడిన కోర్సు వ్యవది: (3) సంవత్సరములు (ఆరు సెమిస్టర్లు) విద్యార్హతలు: ఈ కోర్సులో శిక్షణ కోరే అభ్యర్థులు 10వ తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై యుండవలెను, వయస్సు: 01-07-2025 తేది నాటికి బి.సి, జనరల్ కేటగిరిలకు (23) సంవత్సరములు వయస్సు ఉండవలెను. షెడ్యుల్ కులాలు/షెడ్యుల్ తెగల వారికి(25) సంవత్సరముల వయస్సు వరకు అనుమతించ బడును. కావున, హనుమకొండజిల్లా నుండి 2025-26 విద్యా సంవత్సరానికి గాను (3) సంవత్సరముల డిప్లొమా ఇన్ హాండ్లూమ్ టెక్నాలజి కోర్సు చదువుటకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు 2025 ఏప్రిల్ మొదటి వారంలోగా హైదరాబాదులోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యునివర్సిటి కార్యాలయములో దరఖాస్తులు సమర్పించగలరని, ఇతర వివరాలకు శ్రీ హిమజా కుమార్, ఓ.ఎస్.డి, సెల్ నెంబర్. 9030079242ద్వారా సంప్రదించగలరని కోరడమైనది.

## హైదరాబాద్‌లో జూనియర్ లెక్చరర్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం...




**హైదరాబాద్,మార్చి12(పీసీడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఇంటర్మీడియట్ మరియు పాలిటెక్నిక్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ పదవులకు కొత్తగా నియామకమైన అభ్యర్థులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నియామక పత్రాలను అభ్యర్థులకు అందజేశారు. ముఖ్యమంత్రితో పాటు, బి సి మరియు రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి, యువతకు గుణాత్మక విద్య అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది అని పేర్కొన్నారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలను చేపట్టే ప్రణాళికలో భాగంగా ఈ నియామకాలు జరిగాయని వివరించారు.మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులకు ఉన్నత స్థాయి బోధన అందించేందుకు కొత్తగా నియమితులైన లెక్చరర్లు కృషి చేయాలి అని సూచించారు. తెలంగాణ విద్యా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వ తపన అభినందనీయమని, మరిన్ని ఉపాధ్యాయ నియామకాలు త్వరలో చేపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, నియామకమైన అభ్యర్థులు పాల్గొని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ

**మహబూబాబాద్,మార్చి.12 (పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ శిక్షణా సంస్థ ద్వారా బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ లో బి.సి. విద్యార్థులకు ఒక నెల పాటు నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బి.సి. స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా . ఎం.వి.పి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ప్రైవేటు బ్యాంకుల్లో ప్లేస్ మెంట్ కల్పిస్తారని ఆయన తెలిపారు. డిగ్రీ పూర్తయిన 26 సం.ల లోపు వయస్సు ఉన్న అభ్యర్థులు అర్హులని ఆయన తెలిపారు. ఈనెల 15వ,తేదీ నుండి ఏప్రిల్ 8వ, తేదీ వరకు దరఖాస్తులను www.tgbc-studycircle.cgg.gov.in ఆన్ లైన్ ద్వారా చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా పరీక్ష ఉంటుందని, పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా (30) మందిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. మరింత సమాచారం కోసం 040-29303130 ని సంప్రదించాలని ఆయన కోరారు.

## ఎల్.ఆర్.ఎస్ 25% ప్రభుత్వ ఇస్తున్న రాయితీని ప్రజలు వినియోగించుకోవాలి

- సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు ప్లెక్సీలతో ఎల్.ఆర్.ఎస్ పై అవగాహన
- సబ్ రిజిస్టర్.. రవీందర్ బాబు






**మహబూబాబాద్, మార్చ్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు ప్రభుత్వం ఇచ్చినటువంటి ఎల్.ఆర్.ఎస్ రాయితీని 25% వరకు తగ్గిస్తున్నట్టుగా ప్రభుత్వం ఇచ్చిన రాయితీని ప్రజలకు సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు రిజిస్టర్ రవీందర్ బాబు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల మార్చి31 వరకు ప్రభుత్వ 25% రుసుము రాయితీ కల్పించడం జరిగింది.లేఔట్ లేకుండా కొన్ని ప్లాట్లు అమ్మి ఇంకా మిగిలిన ప్లాట్లు అమ్ముడు పోని 2020 లో ఎవరైతే ఎల్.ఆర్.ఎస్ అప్లై చేశారో వారు ఇప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకునే ముందు ఎల్.ఆర్.ఎస్ కట్టి 25% రాయితీ కూడా పొందే అవకాశం ఉంది. కాబట్టి ఇట్టి అవకాశాన్ని ప్రజలు వినియోగించుకొగలరు. దీనివల్ల ప్రజలు బ్యాంకు లోను సదుపాయం కూడా పొందే అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వం ఇచ్చిన 25% రాయితీని పొంది ఎల్.ఆర్. ఎస్ కట్టుకోవాలని ప్రజలను కోరారు.

## సి ఎస్ ఆర్ ఫండ్స్‌తో ప్రజా అభివృద్ధికి పరిశ్రమలు సహకరించడం అభినందనీయం: కలెక్టర్ వల్లూరు క్రాంతి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేట్ సామాజిక బాధ్యత స్కీమ్ లో భాగంగా భవనాలను ఆధునికరించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ..సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కూడా వివిధ రకాల బహుళ పరిశ్రమలు ఉన్నాయి . ఈ పరిశ్రమలు ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలలకు, గ్రామాలకు ఎన్నో రకాలుగా తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత స్కీమ్ లో భాగంగా వాటర్ ప్లాంట్స్, పాఠశాలలో భవన నిర్మాణానికి, గ్రామాలలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సహాయం చేయడం హర్షించదగ్గ పరిణామం అని కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు.తదనంతరం పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సంవత్సరం పదో తరగతి లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచిచారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల అధికారులు, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఎం ఈ ఓ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కొమ్మలగుట్ట లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న లీగల్ సెల్ నాయకులు

- స్వామివారిని దర్శించుకున్న బిఆర్ఎస్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు గుర్రాల వినోద్ కుమార్, లీగల్ టీం నాయకులు



**హనుమకొండ, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా, గీసుగొండ మండలం లో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ కొమ్మలగుట్ట లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నా సందర్భంగా బుధవారం బిఆర్ఎస్ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షులు గుర్రాల వినోద్ కుమార్ దేవస్థానం ను సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా న్యాయవాది వినోద్ కుమార్, లీగల్ టీం నాయకులకు ఆలయ ఈ ఓ అద్దంకి నాగేశర్ రావు, అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో దేవస్థాన పునరుద్ధరణ వ్యవస్థాపక అధ్యక్షులు కక్కెర్ల శ్రీనివాస్, లీగల్ సెల్ నాయకులు శ్రీరామ్ కిరణ్ కుమార్, మిర్యాల వేణు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాశాఖ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు 'దండి మార్చ్ స్మారక దినోత్సవాలు'

● జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్ రెడ్డి .

● గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ డా.పరికిపండ్ల అశోక్




**మహబూబాబాద్, మార్చి.12 (పిసిడబ్ల్యు న్యూస్):** దండి మార్చ్ స్మారక దినోత్సవాన్ని పురస్కరించు కొని గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నెలరోజుల కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గాంధీ సిద్ధాంతాల కరపత్రాలు, బ్రోచర్లను ఆవిష్కరించారు . గాంధీజీ రీసెర్చ్ ఫౌండేషన్ విస్తృత కార్యాచరణ.... అహింసా సత్యమార్గాల వ్యాప్తికి కృషి ,యువతలో గాంధీతత్వం నింపడమే ఈ కార్యక్రమాల లక్ష్యమని తెలిపారు.బుధవారం కలెక్టరేట్లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 1930 వ, సంవత్సరంలో గుజరాత్ రాష్ట్రంలోని సబర్మతి ఆశ్రమం నుండి మార్చి 12 తారీకు నాడు మొదలై దండి వరకు 24 రోజుల పాటు జరిగిన ఉప్పు సత్యాగ్రహం మార్చ్ నే దండి మార్చ్ గా భారతదేశ చరిత్రలో స్వాతంత్ర ఉద్యమ చరిత్రలో కీలక ఘట్టంగా పేర్కొంటారని తెలిపారు. గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్, జాతీయ అవార్డు గ్రహీత డా.పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలకు గొప్ప మేధావులు సైతం ఆకర్షితులైనారని, వారిలో మార్టిన్ లూథర్ కింగ్, ఐన్ స్టీన్,బరాక్ ఓ, దలైలామా వంటి ప్రముఖులు గాంధీ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు పాటుపడ్డారని,నాటి భారత దేశ స్వాతంత్ర సంగ్రామం మొదలు నిన్న,మొన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వరకు ప్రజలు అహింసాయుత సత్యమార్గాలలోనే విజయం సాధించారనేది నిత్య సత్యమని, నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో నిత్యం హింస ప్రవృత్తి,హత్యలు, ఆత్మహత్యలు,మానభంగాలు అనేకం చోటు చేసుకుంటాయని, ఉన్నత సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన భారతదేశం... ఆత్మహత్యలు,నిరక్షరాస్యత, అవినీతిలో ముందంజలో ఉండటం సిగ్గుచేటని, ఇటువంటి పరిస్థితులకు పరిష్కారం మార్గాలుగా మనం మళ్లీ మూలాల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆ క్రమంలో భారతదేశం ఒక సంపూర్ణమైన ఎదుగుదలతో కూడిన వికాసంతో పరినితి చెందిన మనస్తత్వం గల యువతీ, యువకులుగా ఎదగడానికి, కౌమారదశలో సరైన మార్గ నిర్దేశం చేస్తూ విద్యార్థులను జాగృతం చేయాల్సిన సామాజిక బాధ్యతను గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ తీసుకుంటుందని డా.పరికి పండ్ల అశోక్ తెలిపారు. ఈ క్రమంలోనే గాంధీజీ సిద్ధాంతాలను ప్రజల్లోకి,విద్యార్థి లోకానికి విస్తృత ప్రచారం చేయడం కోసం దండి స్వరక దినోత్సవం రోజు నెల రోజుల జిల్లా వ్యాప్త కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని జిల్లాలోని బుద్ధి జీవులు, మేధావులు, విద్యాసంస్థలు, అధినేతలు సహకారం అందించి కార్యక్రమాన్ని ముందుండి నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఏ.డి రాజేశ్వరరావు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, సి.డి.ఓ విజయ కుమారి, ఏ.సీ.జీ.యి మందుల శ్రీరాములు ఉన్నారు.

## రైతుల అభివృద్ధే నా లక్ష్యం

● నేను ఎలాంటి అవినీతికి పాల్పడలేదు: పిఎసిఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి





**టేక్మాల్, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** టేక్మాల్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ పిఎసిఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి. అధ్యక్షతన బుధవారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ డైరెక్టర్లు. రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ యశ్వంత్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు పర్యాయాలుగా చైర్మన్ పదవిలో ఉండి టేక్మాల్ మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని జిల్లాలో ప్రథమ స్థానంలో అభివృద్ధి పరుస్తూ రైతులకు మేలు జరిగేలా పనిచేశానన్నారు. ప్రభుత్వాలు మారిన తర్వాత అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు తనపై కక్ష్యపూరితంగా చైర్మన్ పదవి నుండి తొలగించాలని ఉద్దేశంతో తనపై 21 లక్షల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని తప్పుడు ప్రచారం చేస్తు తనపై అవిశ్వాస తీర్మానం పెట్టి ఎస్ ఓ. ఆర్డీవో తో విచారణ చేపిచ్చిన తను ఎక్కడ అవినీతికి పాల్పడనట్లు అధికారులు తెలిపారని అన్నారు. మళ్లీ పిఎసిఎస్ చైర్మన్ పదవిలో తను కొనసాగటం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న సొసైటీని కొందరు నాయకులు తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రాథమిక సహకార సంఘం నిర్వర్యం అవుతుందని అన్నారు. ఇకనైనా ఆలోచించి తప్పుడు ప్రచారాలు చేయకుండా సొసైటీని అభివృద్ధి దిశగా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు రవిశంకర్. యాదయ్య. శ్రీశైలం. దుర్గారెడ్డి. గోవింద చారి. నాయకులు భక్తుల వీరప్ప. సిద్దయ్య. ముక్తార్. చింత రవి. సలీం. రైతులు పాల్గొన్నారు.

## మద్దిమాడలో వెలసిన శివలింగం

● శివలింగాన్ని దర్శించుకునేందుకు తండోపతండాలుగా వస్తున్న జనం

● శివలింగం వెలుస్తుందని ముందేచెప్పిన భక్తుడు





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి,మర్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన అద్భుతాలు ఎన్నో జరుగుతూనే ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మద్దిమాడ గ్రామపంచాయతీలో బుధవారం ఉయ్యాల రవి ఇంటి ఆవరణ కాలి స్థలంలో శివలింగం వెలిసింది. గ్రామం మధ్యలో శివలింగం నూతనంగా వెలుడంతో చుట్టుపక్కల గ్రామాల జనం శివలింగాన్ని చూసేందుకు వస్తున్నారని భక్తుల పేర్కొన్నారు. ఈ విషయంపై దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఓరియంట్ సిమెంట్ కాలనీలో గల ఎనగందుల శ్రీనివాస్ 15 రోజుల క్రితమే అతని కలలో ఈ గ్రామం మధ్యలో శివలింగం వెలుస్తుందని గ్రామస్తులు అందరికీ పూజారులకు కూడా ఈ విషయాన్ని వెల్లడించారని అన్నారు. మరో భక్తురాలు ఉయ్యాల స్వరూప ఆమె కలలో శివయ్య ప్రత్యక్షమై పౌర్ణమి రోజున పూజలు చేయాలని అదే ప్రాంతంలో గుడి నిర్మాణం చేపట్టాలని చెప్పినట్లుగా వారు పేర్కొన్నారు. తరలివచ్చిన జనం మాత్రం స్వయంభుగా వెలసిన శివలింగమా లేక ఏర్పాటుచేసిన శివలింగమని కొందరు భక్తులు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. శివ పూజ చేసి వై. శ్రీనివాస్ మాత్రం శివలింగంపై అనుమానాలకు తావు లేదని స్వయంభు గానే వెలిసినట్లు పేర్కొంటున్నారు. ఈ విషయంపై నేడు పూజారులు వచ్చి పౌర్ణమి రోజున పూజలు జరపనున్నారని అన్నారు. పూర్తి సమాచారం నేడు తెలియాల్సి ఉంది. ఇదే నిజమైతే మద్దిమడ గ్రామపంచాయతీలో శివాలయం ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మారుమూల అడవి ప్రాంతంలో ఇంకా ఎన్ని అద్భుతాలు జరగనున్నయ్యా వేచి చూడాల్సిందే అంటున్నారు భక్తులు.

## ఇకనైనా అసత్య ఆరోపణలు మానుకో..



**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** మా నేతలపై హద్దు, పద్దు లేకుండా మాట్లాడుతున్నారని, ఇకనైనా ఆత్మ విమర్శన చేసుకుని, అసత్య ఆరోపణలు మానుకోవాలని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని నరేందర్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం బాల సముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రైఫిల్ చేతపట్టుకొని, ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేసిన మిమ్ములను తెలంగాణ సమాజం మరిచిపోదన్నారు. అలాంటి మీరు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిల్చి ప్రత్యేక తెలంగాణ సాధించిన కేసీఆర్, హరీశ్ రావులను విమర్శించడం సిగ్గుచేటన్నారు. నాటి టీఆర్ఎస్ నేటి బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల పండుగకు ఓరుగల్లు వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో వరంగల్ ప్రత్యేక స్థానం ఉందన్నారు. కేసీఆర్ లేని తెలంగాణ ఉద్యమాన్ని ఉహించలేం అన్నారు. రాజకీయాల్లో విమర్శలకు ఓ హద్దు, పద్దు ఉంటుందని, ఏం మాట్లాడుతున్నావో నీకేమైనా అర్థం అవుతుందా.. అని ప్రశ్నించారు. 25 ఏండ్ల పండుగ జరుపుకొంటున్న వేళ ఇలా విమర్శలు చేయడం మీ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అభివృద్ధి అంటూ గొప్పలు చెప్పుకుంటున్న నాయిని తనే వరంగల్ నగరాన్ని నిర్మించినట్లు ఫోజులు కొడుతుండడం దురదృష్టకరమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేని పరిస్థితి లో మీరు ఉన్నారని, ముందు ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలని హితువు పలికారు. కేవలం 15 నెలల్లోనే కాంగ్రెస్ పై తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో వాడవాడలా రోడ్లు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కాళోజీ కళాక్షేత్రం, ఇన్నర్ రింగ్ రోడ్డు, నయీమ్నగర్ నాలా, వేల కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశాం. మీరు ఏం చేశారో అంచనా వేసుకో.., నీకు ఉన్న అనుభవరీత్యా తెలుసుకో మిత్రమా అంటూ మరో మార్పు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు నాగూర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి, నాయకలు జనార్దన్ గౌడ్, పులి రజినీకాంత్, సారంగపాణి, నయీమొద్దీన్, రవీందర్ రావు, నార్లగిరి రమేష్, యాదగిరి, జానకి రాములు, రాజు, పరుశురాములు, ఖలీల్, మహేష్, రఘు, శ్రీధర్, ప్రశాంత్, వెంకన్న, యాకుబ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్‌ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు జగిత్యాల జిల్లా అర్ టి ఏ మెంబర్

**జగిత్యాల, మర్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లా కేంద్రంలో రవాణా శాఖ కార్యాలయము నిర్మాణమునకు అనువైన ప్రభుత్వ స్థలము కేటాయించగలరని కోరుతూ, కార్యాలయ సిబ్బందికి విధి నిర్వహణలో ఏర్పడుతున్న ఇబ్బందులు తదితర సమస్యల పరిష్కార నిమిత్తం జగిత్యాల జిల్లా కేంద్రంలో 10 ఎకరాలు (ఏ టి ఎస్ ఆటోమేటిక్ టెస్టింగ్ ఫిట్నెస్ స్టేషన్, సైంటిఫిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్, ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ వెహికల్ సీజర్ యార్డ్ లకు స్థలం కేటాయించాలని కోరుతూ జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. జగిత్యాల జిల్లా అర్ టి ఏ మెంబర్ కమటాల శ్రీనివాస్. నాయకులు అడువాల లక్ష్మణ్, గంగాధర్, పాల్గొన్నారు.





## పట్టణ ఆవోపా ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్స్ వారిచే ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

**జగిత్యాల, మర్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** యశోద హైటెక్ సిటీ సూపర్ స్పెషాలిటీ, డాక్టర్స్ హరీష్, కీర్తి, చైతన్య లచే సుమారు 250 మందికి పైగా ఉచితంగా వైద్య సేవలు అందించి అవసరమైన వారికి ఉచిత ఫిజియోథెరపీ మరియు రాయితీ లో అవసరమైన స్కానింగ్లు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్షులు పబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మోటూరి శ్రీనివాస్, కోశాధికారి వూటూరి నవీన్, అదనపు కార్యదర్శి పల్లెర్ల నరేష్, ఎలిమిల్ల సాగర్, కట్కూరి సంతోష్ పాల్గొన్నారు.

## శ్రీ రాగుల మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా



**రామడుగు/చొప్పదండి,12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లాచొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో సాయిల్ల (ఒగ్గు) వంశీయుల ఆధ్వర్యంలో శ్రీ రాగుల మల్లికార్జున స్వామి భ్రమరాంబికా దేవి కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి.ఈ పూజా కార్యక్రమాలు ఆదివారం రోజున పుట్ట బంగారు తెచ్చుట,సోమవారం రోజున మల్లికార్జున స్వామి లగ్నం కార్యక్రమం,మంగళవారం రోజున జోగు తిరుగుట,బుధవారం రోజున నాగవెల్లి కార్యక్రమంతో ముగిశాయి.బుధవారం రోజున నాగవెల్లి రోజున స్వామివారికి దూప దీప నైవేద్యాలు సమర్పించి స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.కార్యక్రమంలో భాగంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, సాయిల్ల వంశీయులు,బంధువులు,కుల పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రైస్ పట్టివేత

- ఒకరు అరెస్ట్, పరారీలో మరో ఇద్దరు

**రామగుండం,12(పిసిడబ్ల్యూ న్యూస్):** రామగుం డం పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు సీఐ రమేష్ బాబు ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్సు సిబ్బంది కలిసి పెద్దపల్లి జోన్ గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 ఇంక్లైన్ వద్ద, మంథని నుండి గోదావరిఖని మీదుగా మహారాష్ట్ర కి వెళ్తున్న డీసీఎం వ్యాన్ (TS-02-UA 1517) ద్వారా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తి దేశెట్టి మారుతి ని అదుపులోకి తీసుకుని, డీసీఎం వ్యాన్ లో తరలిస్తున్న సుమారు 79.50 క్వింటాళ్ల బియ్యం విలువ 3,08,100/- రూ" స్వాధీనం చేసుకోవడం జరిగింది. రాచర్ల రమేష్, ఓదెల మహేం దర్ పరారీలో ఉన్నారు.స్వాదినపరుచుకున్న 79.50 పిడిఎస్ రైస్, డీసీఎం వ్యాన్, నిందితున్ని తదుపరి విచారణ నిమిత్తం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ వారికీ అప్పగించడం జరిగింది.

## విధి నిర్వహణలో మానవత్వాన్ని మరచిపోని డీసీపీ ఏ. భాస్కర్...

**మంచిర్యాల:12(పిసిడబ్ల్యూ న్యూస్):** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ మంచిర్యాల నుండి లక్షెట్టిపేట వైపు వెళ్తున్న సమయంలో వేంపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ప్రమాదం చేసి వెళ్లగా సదరు మహిళా రోడ్డు పై పడి ఉండడం గమనించి వాహనం ఆపి వెంటనే డీసీపీ మంచిర్యాల ప్రభుత్వ హాస్పిటల్ కు స్వయంగా దగ్గర ఉండి ఆటో లో పంపించండం జరిగింది. డీసీపీ స్పందించిన తీరును వాహన దారులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## రామచంద్రపురంలో గ్రామంలో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేల

**బచ్చన్నపేట,12(పిసిడబ్ల్యూ న్యూస్):** బచ్చన్నపేట మండలం రామచంద్రపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినో త్సవం జరుపుకున్నారు. అందులో భాగంగా డిఈఓగ సనాది మనచర ణ్.ఎంఈఓగా మహమ్మద్ ఆసిన్. హెచ్ఎంగా మేకల దుర్గా వర్షిని. ఉపా ధ్యాయలుగా కే వర్షిని. బి చరణ్ రోషి, డి ప్రవస్తి.కె వరుణ్ తేజ్. రోషన్. ఎన్ హర్షవర్ధన్.పాఠశాల అటెండర్ ఆంజనేయులు. డివో అసిస్టెంట్గా కే హర్షవర్ధన్.ఎంఈఓ అసిస్టెంట్గా యుగంధర్ పాల్గొన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా హాజరైన బచ్చన్నపేట ఎంఈఓ ఇర్రి వెంకటరెడ్డి మాట్లాడుతూ చదువుకునే వయసులోనే విద్యార్థిని విద్యార్థులు మంచి అలవా టు నేర్చుకోవాలని అన్నారు.



## లోడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సన్మానం

**మంథని:మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** మంథనిలోని కన్నాల గ్రామపంచాయతీ పరిధిలో గల ముస్కుల రత్తమ్మ,రంగారెడ్డి కుమారుడు అయినటువంటి ముస్కుల వెంకట్ రెడ్డి,భార్య పుల్లమ్మ పుణ్య దంపతులు చేసిన రాజకీయా,సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా వారిని అభినందించారు.వ్యవసాయాన్ని విభిన్నంగా,వినూత్నమైన నూతన పోకడలను అవలంబించి ఆ రంగంలో రాణించివారి పిల్లలను ఉన్నతమైన స్థితిలో తీర్చిదిద్ది సమాజంలో వారి కుటుంబం ప్రత్యేక గుర్తింపు పొందినారు. అదేవిధంగా వారిని నమ్ముకున్న ప్రజల,శ్రేయోభిలాషుల కష్టాల్లో పాలు పంచుకుంటూ వారి అభివృద్ధిలో భాగమై ప్రజల పట్ల విధేయులై అనేక సేవా రోజువారి ఇంట్లో నిత్యా అన్నదాన కార్యక్రమాలు చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందినారని మదర్ థెరిస్సా మహిళా బ్యాంకు పొదుపు సంస్థ కోఆర్డినేటర్ మేకల మల్లేశం,బ్యాంకు అధ్యక్షులు మాదేశి పద్మ,ప్రధాన కార్యదర్శి నామని సుగుణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ కౌన్సిలర్ నక్క నాగేంద్ర,శంకర్ లోడి కార్యవర్గ సభ్యులు వేల్పుల సరోజన పుల్లె లక్ష్మి,ఎరుకల శోభా,గడిపెల్లి శ్యామల ఇంకా తదితరులు వారి సేవలను కొనియాడారు..

## గ్రూప్ 2లో 143 ర్యాంక్ సాధించిన అభ్యర్థి



**ముత్తారం:మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** ముత్తారం మండలం సీతంపల్లి గ్రామానికి చెందిన గంట రాజా గౌడ్ కుమారుడు,గంట మహేష్ గౌడ్ గ్రూప్ 2 ఫలితాలలో రాష్ట్ర వ్యాప్తంగా 143 ర్యాంక్ సాధించాడు. కాగా ఇంతకు ముందు కూడా గ్రూప్ 4 ఫలితాలలో విజయం సాధించి,ప్రస్తుతం పెద్దపల్లి పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్నారు. పట్టుదలతో సివిల్స్ ప్రిపేర్ అయిన మహేష్ గౌడ్ మొదటి దఫా లో సివిల్స్ రాకపోవడంతో గ్రూపులో విజయం సాధించారు. జేఎన్టీయూ కళాశాలలో మైనింగ్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన మహేష్ గౌడ్ ఇంటర్మీడియట్ విద్యను మంథనిలో నుంచి చైతన్య జూనియర్ కళాశాలలో చదివి ఇంటర్మీడియట్ లో జిల్లాలో ప్రథమ స్థానం సంపాదించారు. ఏప్పటికైనా సివిల్స్ సంపాదించాలని లక్ష్యంతో ప్రిపేర్ అవుతున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. మహేష్ గౌడ్ కు డిప్యూటీ తాసిల్దార్ కానీ, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఉద్యోగం లభించే అవకాశం ఉంది..

## ఇరవై రోజుల ముందుగానే బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన ఓ.సి.పి-2 ఆర్.జీ-3 ఏరియా జి.యం

**రామగిరి:మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను ఓసిపి-2 అధికారులకు,ఉద్యోగులకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం ఓసిపి-2 ఉపరితల గనికి నిర్దేశించిన 27.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 100 శాతం అనగా 27.52 లక్షల టన్నుల బొగ్గును ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి 20 రోజుల ముందుగానే ఉత్పత్తి చేసినందుకు సంబంధిత అధికారులకు,ఉద్యోగులకు అభినం దనలు తెలియజేశారు.లక్ష్యాన్ని సాధించడంలో సహకరించిన సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ కు,డైరెక్టర్లకు,కార్మిక సంఘాల నాయకులకు,ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు,స్థానిక ప్రజా ప్రతినిధులకు,పరిసర ప్రాంతాల ప్రజలకు,పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు.అంతేకాకుండా నిర్దేశించిన గడువులోపు బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికి ఓసిపి-2 ఉపరితల గని విస్తరణలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధిస్తూ,సింగరేణి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.




# ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలి

### • 63 డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి




**హనుమకొండ, మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పశ్చిమ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పై పసలేని ఆరోపణలు చేసినవరంగల్ తూర్పు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, నన్నపునేని చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని కాజీపేట 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అధికార వచ్చి 15 నెలలలో వరంగల్ పశ్చిమ ను అభివృద్ధి దిశలో ముందుకు నడుపుతూ.. నమ్మిన కార్యకర్తలను కాపాడుకునే వ్యక్తి నాయిని రాజేందర్ రెడ్డి అని, అలాంటి వ్యక్తిపై నన్నపనేని నరేందర్ పెద్ది సుదర్శన్ రెడ్డి నర్సంపేట నుండి వచ్చి విమర్శలు చేస్తున్నావా..? ఎందుకు ఇక్కడ టిఆర్ఎస్ నాయకత్వం లేదా 25 సంవత్సరాల సంబరాలు వరంగల్ లో జరుపుకుంటే జరుపుకోండి ఎవరు మీకు అడ్డుపడరు. మీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏది చేసినా వరంగల్లు వేదికగా చేసుకోవడం అలవాటు.., కానీ అది గతంలో ఇప్పుడు ఇక్కడి ప్రజానికం కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితమ్మను నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరని, మానుకోట ఘటనలో అసలు ఏమి జరిగింది ఎవరు ఆ ఘటనకు పాత్రధారులు తెలంగాణ ప్రజలకు తెలుసని, ఇంకా మీరు తెలంగాణ ఉద్యమమని, తెలంగాణ రాష్ట్రమని, సెంటిమెంట్ డైలాగులు కొడితే ఎవరు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రభుత్వం మారి 15 నెలలు అయితే ఫామ్ హౌస్ లో పండుకున్న నేత మీ కెసిఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆనాటి యూపీఏ చైర్పర్సన్ సోనియాగాంధీ కాళ్లు పట్టుకొని కుటుంబంతో సహా ఫోటోలు దిగిన మాట వాస్తవం కాదా.. అని గుర్తు చేశారు. సోనియాగాంధీకి టిఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం చేస్తానని, రాష్ట్రం ప్రకటించిన తర్వాత కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీని మోసం చేసిన మాట వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు. అలాగే నిండు అసెంబ్లీలో టిఆర్ఎస్ నేత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సోనియా గాంధీ దయవలె మనకు ఈరోజు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, నిండు అసెంబ్లీలో ప్రస్తావించిన మాట వాస్తవం కాదా అన్నారు. కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కారుతో మీ రహస్య ఒప్పందం ఉన్నాయా లేదా లిక్కర్ కింగ్ మాఫియా లేడీ డాన్ కల్వకుంట్ల కవిత ఏం ఘనకార్యం చేసిందని, జైలు నుండి విడుదల అయినప్పుడు విక్టరీ సింబల్ చూపిస్తున్నదని చురకలంటించారు. ఇక పోతే కేటీఆర్ ఐటీ మినిస్టర్ గా ఉన్నప్పుడు ఎన్ని మోసాలు ఎన్ని స్కాములు, రాష్ట్రాన్ని ఊడ్చుకొని పోయారని ఆరోపించారు. ఈరోజు మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మీరు చేసిన అప్పులకు రూ. 16 వేల కోట్లు కేవలం మిత్తి చెల్లిస్తుందని, ఈ ప్రభుత్వం శ్రీలంకలో ఉన్న రూల్స్ రెగ్యులేషన్స్ ఇక్కడ ఉంటే బాగుండేదని, ప్రజలు తరిమికొట్టే వారన్నారు. ఈరోజు కాంగ్రెస్ పార్టీ ల్యాండ్ మాఫియా సాండ్ మాఫియా లిక్కర్ మాఫియా ప్రోత్సహిస్తుందని మీరు అంటున్నారు.. ఎక్కడైనా ప్రజల్లారా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఎక్కడైనా ల్యాండ్ కబ్జాలు, ఇసుక మాఫియా లు ఉన్నాయా.. ఇది మా ప్రజా ప్రభుత్వమని, నన్నపినేని నరేందర్ పెద్ది సుదర్శన్ రెడ్డి మీ మాటలు జాగ్రత్త అది తెలంగాణ ఉద్యమం అప్పుడు మేము సైతం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వ్యక్తులం ఏకంగా ఎమ్మెల్యే పదవులకు మినిస్టర్ పదవులకు కూడా రాజీనామా చేసిన చరిత్ర మా కాంగ్రెస్ పార్టీకి ఉంది 25 సంవత్సరాల సంబరాలు చేసుకుంటేనే మీకు ఇంత పొగరు ఉంటే స్వాతంత్రం తెచ్చిన పార్టీ వందేళ్లు దాటిన పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీకి ఎంత పొగరు ఉండాలి ఒకసారి ఆలోచించండని హితువు పలికారు.గతంలో ప్రజలు మిమ్మల్ని నమ్మినట్టుగా ఇప్పుడు నమ్మరు నాయిని రాజేందర్ రెడ్డి మీద మీరు చేస్తున్న వ్యాఖ్యలు ఆయన చేసే అభివృద్ధి కార్యక్రమాలను ఓర్వలేక ఆయనే తెచ్చే నిధులను చూసి ఓర్వలేక ఆయనపై వ్యాఖ్యలు చేస్తున్నారని, జాగ్రత్త బీజేపీతో మోడీతో అమిత్ షా తో మీ రహస్య ఒప్పందాలు మీ రహస్య సమావేశాలు ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికలలో కొడుకు కేటీఆర్ ని ఎంపీగా పోటీ చేసి బిడ్డ కవితను ఎమ్మెల్యేగా పోటీ చేపిస్తూ అటు కొడుకును కేంద్ర మంత్రి చేద్దామనే నీచమైన ఆలోచన మీ అధినేత కేసిఆర్ ది కెసిఆర్ ని గవర్నర్ పదవి ఇవ్వాలని అమిత్ షా తో మాట్లాడిన మాట వాస్తవం కాదా.. ప్రశ్నించారు? బిడ్డను లిక్కర్ కేసు నుంచి తప్పిస్తే బిజెపిలో టిఆర్ఎస్ ను విలీనం చేస్తామన్న మాట వాస్తవం కాదా..! అని ప్రశ్నించారు. మీరా మాట్లాడేది మీ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తా అన్నది దళితులకు ఐదు ఎకరాల భూమి ఇస్తా అన్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు దళిత బందులు ఎంతమందికి ఇచ్చారు. 5 ఎకరాల భూమి ఎంత మందికి ఇచ్చారు. బీసీ బందులు ఎంతమందికి ఇచ్చారు. మైనార్టీ రిజర్వేషన్ 12 శాతం అన్నారు. ఎందుకు చేయలేదని, ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి మీ ప్రభుత్వంలో ఎందుకు ఇయ్యలేదని ప్రశ్నించారు. దళితులను ఆమడ దూరం పెట్టిన మీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈరోజు తెలంగాణ ప్రజలు గుర్తుకొచ్చారా..? అసెంబ్లీకి వచ్చావు ఎన్నికల దగ్గర వస్తే రెండు పెగ్గులు వేసి మైకు పట్టుకోవడం కాదు.. తెలంగాణ ప్రజల మనోభావాలను వారి బాధలను తెలుసుకోవాలని, రైతే మారాజు రైతే దేవుడు రైతే నా ప్రాణం అన్న కేసీఆర్ ఖమ్మం జిల్లా రైతులకు చేతులకు బేడీలు వేసి జైలుకు పంపించిన మాట వాస్తవం కాదా.. అని ప్రశ్నించారు? కాంగ్రెస్ పార్టీ నాయకుల పైన కార్యకర్తల పైన రౌడీషీటర్, బైండోవర్లు ఎన్నో కేసులు పెట్టిన మాట వాస్తవం కాదా..! తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని విమర్శించే స్థాయి మీకు లేదని, ఉద్యమాల పేరుతో జేఏసీల పేర్లతో అన్ని పార్టీల దగ్గర వసూల్ చేసిన చరిత్ర మీదని విమర్శించారు. విద్యార్థులను యువతను మీ మోసపూరితమైన మాటలతో వారు ఆత్మహత్య చేసుకునే విధంగా మీ మోసపూరితమైన మాటలు విని ఎంతోమంది తెలంగాణ విద్యార్థులు ఉద్యమకారులు ఆఖరికి ఉద్యోగులు కూడా ఆత్మ బలిదానాలు చేసుకున్నారని, తెలంగాణ ఉద్యమంలో అసువులు పాసిన ఆ కుటుంబాలకు మీరు ఏం సాయం చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. శ్రీకాంత్ చారి పోలీస్ కిష్టప్ప వారి కుటుంబాలకు మీరు ఇచ్చే గౌరవం ఏమిటి ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయని, ఇప్పటికైనా నాయిని రాజేందర్ రెడ్డిపై మీరు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకుంటే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని, 2021 గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్పొరేటర్లగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుండి నలుగురం కార్పొరేటర్ గెలవడం జరిగిందని, మరి రెండున్నర సంవత్సరాలు మాకు మీరు ఇచ్చిన నిధులేవి అభివృద్ధి కార్యక్రమాలు ఏవి ఏమి చేశారు.. మా డివిజన్ లో 30 సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి, కేవలం కొన్ని నెలల్లోనే కాజీపేట అభివృద్ధి నాయిని రాజేందర్ రెడ్డి సహకారంతో జరుగుతోందని, అది ప్రజలు గమనిస్తున్నారని, ఇది ఒకటి నేర్చుకున్నారు. ఏ అభివృద్ధి కార్యక్రమం చేసిన అది మా ప్రభుత్వంలోనే జరిగింది. మా ప్రభుత్వంలోనే మంజూర అయింది. అలా చెప్పడానికి సిగ్గుండాలి! మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా బిఆర్ఎస్ నాయకులను గాని బిఆర్ఎస్ పార్టీని గానీ నమ్మే ప్రసక్తి ఈ తెలంగాణ ప్రజలకు లేదని, కాంగ్రెస్ పార్టీ 15 నెలలుగా ఏమి చేస్తుంది అని మీరు ప్రశ్నిస్తున్నారు.. కదా! మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లకు విద్యుత్ ఫ్రీ, రూ.500 కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, తెల్ల రేషన్ కార్డులు, నిరుద్యోగ యువతకు 50వేల ఉద్యోగాలు, ఇంద్ర మహిళ శక్తి క్యాంటీన్లు, మహిళలకు పెట్రోల్ బంకులు, మహిళలకు ఆర్టీసీ బస్సులు అద్దెకు, రూ. 2 లక్షల రైతు రుణమాఫీ, రైతులకు రూ. 500 వరి బోనస్, కౌలుదారులకు చేయూత, ఆరోగ్యశ్రీ 10 లక్షలకు పెంపు చేసిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, ఈ దేశానికి స్వాతంత్రం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ పార్టీ దేశం కోసం ప్రాణాలు పరంగా పెట్టిన పార్టీ కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీలో ఈ దేశ స్వాతంత్రం కోసం ఎవ్వరైనా పోరాడిన ఒక్క పేరు చెప్పండి అని, తెలంగాణ రాష్ట్ర సాధనకై కేసిఆర్ కుటుంబంలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా.. అని ప్రశ్నించారు? ఇకనైనా కాంగ్రెస్ పార్టీ పైన కానీయండి మా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పైన వ్యాఖ్యలు చేస్తే బిడ్డ ఖబడ్దార్ అంటూ 63 డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ-సయ్యద్ రజాలి ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# దేశానికి దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ



**హైదరాబాద్,మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** అన్ని రంగాల్లో సమృద్ధిని సాధిస్తూ, పురోగతిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణను నిలబెట్టే నిర్మాణానికి అందరం సంఘటితంగా, విశ్వాసంతో, నిబద్ధతతో కలిసి ముందుకు సాగుదామని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. అవకాశాలకు నెలవుగా, అభివృద్ధి మార్గంలో సాధికారత కలిగిన రాష్ట్రంగా ఉన్న తెలంగాణ భవిష్యత్తు మరింత ఉజ్వలమైంది. ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ పరిపుష్టి, సాంకేతిక విజ్ఞానంలో ఆధునికత, సామాజిక న్యాయం వంటి అంశాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలవబోతోందని గవర్నర్ ఉద్ఘాటించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్ర గవర్నర్ ప్రసంగించారు. ప్రభుత్వం చేపట్టిన వినూత్నమైన కార్యక్రమాలతో పాటు ఉజ్వలమైన భవిష్యత్తుకు తెలంగాణ అభివృద్ధికి రూపుదిద్దుకున్న ప్రణాళికలను గవర్నర్ గారు తన ప్రసంగంలో ఆవిష్కరించారు. యున నాయకుడు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పాలసీ, ప్రతి కార్యక్రమం, ప్రతి సంస్కరణ అవకాశాలు కల్పించడానికి, ప్రజల సాధికారత కోసం, సమ్మిళిత వృద్ధి కోసమని స్పష్టమైన విజన్‌తో నిర్దేశించబడిందని గవర్నర్ వివరించారు. బడ్జెట్ కేవలం అంకెల కూర్పు కాదని, భవిష్యత్తు కోసం ప్రభుత్వ ప్రాధాన్యతలు, విజన్‌కు ప్రతిబింబమని పేర్కొన్నారు. గవర్నర్ తన ప్రసంగంలో నా తెలంగాణ ఒక అసాధారణ పరివర్తనకు చేరువలో ఉంది. ప్రభుత్వం ప్రతి పౌరుని ఆకాంక్షలను నెరవేర్చి దేశానికి ఒక ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ముందుకు వెళు తున్నాం. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలకు అనుగుణంగా అపరిమితమైన అవకాశాలతో తెలంగాణ తన ప్రయాణాన్ని వేగవంతం చేస్తూ అభివృద్ధికి ఒక దిక్సూచిలా, ఒక మోడల్ రాష్ట్రంగా ఉండాలని భావిస్తోంది. జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం.. తెలంగాణ గేయం రాష్ట్ర ఏర్పాటుకు కారణమైన పోరాటాలు, త్యాగాలను గౌరవించడమే కాకుండా భవిష్యత్తు కోసం ఆశను, స్ఫూర్తిని నింపుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే నిర్వహించడం ద్వారా ప్రభుత్వం సాహసోపేతమైన మార్పు దిశగా ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. సామాజిక న్యాయాన్ని అందించే దిశగా ఇటీవల నిర్వహించిన సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించడానికి ప్రభుత్వం ఒక బిల్లును ప్రతిపాదించింది. జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సిఫారసుల ఆధారం ఎస్సీ ఉప వర్గీకరణపై బిల్లును ప్రవేశపెట్టనుంది. గ్రామీణ పాలనను బలోపేతం చేయడం, భూ సంబంధిత సేవలను సరళతరం చేయడం, భూ సమస్యలను సకాలంలో పరిష్కరించడం వంటి భూ పరిపాలనను క్రమబద్ధీకరించి, పౌరులందరికీ భూ భద్రత కల్పించడానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టింది. రైతు భరోసా ఆర్థిక సహాయాన్ని ఏడాదికి ఎకరాకు 12 వేల రూపాయలకు పెంచాం.గృహజ్యోతి పథకం ద్వారా 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందిస్తోంది. 43 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరుస్తూ రూ. 500 లకు ఎల్పీజీ సిలిండర్ అందిస్తోంది. యువజన సాధికారత కల్పించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటు ప్రపంచంతో పోటీ పడే నైపుణ్యాలు గల ప్రతిభావంతులను అందించడానికి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను(ఏటీసీ) అందించే కార్యక్రమం చేపట్టాం. గత సంవత్సర కాలంలో 55 వేల మందికి పైగా యువతీ యువకులను ప్రభుత్వ ఉద్యోగాల్లో భర్తీ చేశాం. క్రీడల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు బిల్లును ఆమోదించాం. ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం 40 శాతం డైట్, 200 శాతం కాస్మెటిక్ చార్జీలను పెంచాం. మెట్రో రైలు నెట్ వర్క్ విస్తరణ, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు, ఫ్యూచర్ సిటీ ఏర్పాటు వంటి ప్రాజెక్టులతో దేశంలోనే నెట్ జీరో సిటీగా ఆవిర్భవించాలన్న ఆకాంక్షతో ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దడానికి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేస్తోంది. 7 మండలాలు, 56 గ్రామాలతో 765 చ.కి.మీ విస్తీర్ణంలో ఈ ఫ్యూచర్ సిటీ దేశంలో పట్టణాభివృద్ధిలో ఒక నమూగా నిలువబోతోందని గవర్నర్ వివరించారు. మహిళా స్వయం సహాయక సంఘాలు, ఆరోగ్యశ్రీ పథకం కింద కుటుంబానికి 10 లక్షలకు పెంపు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు గృహ నిర్మాణం, విద్య, ఉపాధికి తీసుకున్న చర్యలు, రాష్ట్రంలో వ్యాపార అనుకూల వాతావరణం కల్పించడం ద్వారా పారిశ్రామిక వృద్ధి సాధన, పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ స్థాయి సౌకర్యాలతో ఐటీ హబ్‌ల విస్తరణ, ఏఐ, డేటా సెంటర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ తన హోదాను సుస్థిరం చేసుకుంటున్న విధానాలు.. వంటి అనేక అంశాలల్లో తెలంగాణ లక్ష్యాలను గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారు.




# రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్సీ ఆఫర్

**• నో చెప్పిన కేఎల్ రాహుల్**

ఛాంపియన్స్ ట్రోఫీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత కెఎల్ రాహుల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. కెప్టెన్సీకి నో చెప్పాడు. కెఎల్ రాహుల్ తీసుకున్న ఈ నిర్ణయం ఐపీఎల్ కెప్టెన్సీకి సంబంధించినది. ఐపీఎల్ 2025లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్ ఆఫర్‌ను రాహుల్ తిరస్కరించాడు. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ రాహుల్‌కు కెప్టెన్సీని ఆఫర్ చేసిందని, దానిని అతను అంగీకరించలేదని నివేదిక పేర్కొంది. కెఎల్ రాహుల్ కెప్టెన్సీ ఆఫర్‌ను తిరస్కరించాడు. ఆటగాడిగా జట్టుకు మరింత సహకారం అందించాలనుకుంటున్నానని చెప్పాడు. కెఎల్ రాహుల్ జట్టు కెప్టెన్సీకి నిరాకరించిన తర్వాత, ఇప్పుడు అక్షర్ పటేల్ ఢిల్లీ ఫ్రాంచైజీకి నాయకత్వం వహించవచ్చని వార్తలు వస్తున్నాయి. ఎందుకంటే కెప్టెన్సీ ఈ రెండు పేర్ల మధ్యే జరిగింది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ రూ.14 కోట్లకు బిడ్డింగ్ చేసి కేఎల్ రాహుల్‌ను కొనుగోలు చేసింది. రాహుల్‌కు గతంలో ఐపీఎల్‌లో కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం ఉంది. 2020-21లో పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్‌గా, 2022 నుండి 2024 వరకు లక్నో సూపర్ జెయింట్స్‌కు కెప్టెన్‌గా ఉన్నాడు. అతను ఢిల్లీలో చేరినప్పుడు కెప్టెన్సీ రేసులో అతడి పేరు ముందంజలో ఉంది. ఇప్పుడు రాహుల్ ఆటగాడిగా మాత్రమే ఆడాలనుకుంటున్నట్లు మీడియా నివేదికలు పేర్కొన్నాయి. రాహుల్ తీసుకున్న ఈ నిర్ణయం ఢిల్లీకి కూడా పని చేస్తుంది. ఐపీఎల్‌లో అత్యంత స్థిరంగా రాణిస్తున్న ఆటగాళ్లలో రాహుల్ ఒకరు. 2018 నుండి 2024 వరకు ఆడిన 7 ఐపీఎల్ సీజన్లలో 6 లో తను 500 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేశాడు. రాహుల్ కెప్టెన్ కాకపోతే అక్షర్ కెప్టెన్ కావడం ఖాయం. కానీ సమస్య ఏమిటంటే రాహుల్ లాగా అతనికి ఐపీఎల్‌లో కెప్టెన్సీ అనుభవం పెద్దగా లేదు. ఆటగాడిగా అతను బ్యాటింగ్, బౌలింగ్ రెండింటితోనూ చాలాసార్లు తనను తాను నిరూపించుకున్నారు. కానీ అతను ఇంకా కెప్టెన్‌గా తనను తాను నిరూపించుకోవాల్సి ఉంది. బహుశా ఢిల్లీ క్యాపిటల్స్ అతనికి ఆ అవకాశం ఇస్తుందేమో చూడాలి.

# ఓపెనర్‌గా ఆడే ఛాన్స్ ఇవ్వండి

**• స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ కీలక వ్యాఖ్యలు**

గత కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తోన్న టీమ్ఇండియా సీనియర్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ మరోసారి తన కామెంట్స్?తో నెట్టింట వైరలయ్యాడు. ఐపీఎల్ 2025 సీజన్ కోసం పంజాబ్ కింగ్స్ తరఫున బరిలోకి దిగుతున్న ఈ స్టార్, రీసెంట్?గా తన టీమ్?తో కలిసి ప్రాక్టీస్‌ను మొదలుపెట్టాడు. అంతకుముందు ఐపీఎల్‌లో రూ.18 కోట్లు వెచ్చించి చాహల్‌ను పంజాబ్ దక్కించుకుంది. అయితే, ఇప్పుడీ కొత్త సీజన్‌లో నయా అవతార్?లో మెరిసేందుకు సిద్ధమంటూ చాహల్ ఓ వీడియోలో సందడి చేశాడు. ప్రస్తుతం ఆ గ్లింప్స్ క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. పంజాబ్ టీమ్? హెడ్? కోచ్? రికీ పాంటింగ్‌కు చాహల్ ఓ ఆఫర్ ఇచ్చాడు. ఒకవేళ టీమ్?కు ఓపెనర్ అవసరం ఉంటే తనను పరిగణనలోకి తీసుకోవాలంటూ ఓ వీడియో మెసేజ్ పంపాడు.'రికీ ఓపెనింగ్ స్లాట్ ఏమైనా ఖాళీగా ఉందా?' అంటూ ఫన్నీ కామెంట్స్ కూడా చేశాడు. అయితే ప్రాక్టీస్ చేసేందుకు వెళ్తున్న సమయంలో రికీని బ్యాటింగ్ ఆర్డర్ గురించి అడగటం కూడా ఆ వీడియోలో ఉంది. దానికి తగ్గట్లుగా రికీ కూడా తన బ్యాటింగ్? స్కిల్స్?ను చూపిస్తూ సందడి చేశాడు. తన ఫన్నీ సైడ్?తో టీమ్? మెంబర్స్?ను నవ్వించాడు.ఇదిలా ఉండగా, చెందిన ముగ్గురు టాప్ ప్లేయర్లను ఎలాగైనా పంజాబ్ టీమ్?లోకి తీసుకోవాలని అనుకున్నట్లు గతంలో రికీ పాంటింగ్ వెల్లడించాడు. అందులో చాహల్ కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించాడు. మెగా ఆక్షన్?లో నేను టీమ్ఇండియాకు చెందిన ముగ్గురు ప్లేయర్లను దక్కించుకోవాలని బలంగా అనుకుంటున్నాను. అందులో నాలుగేళ్లుగా టీమ్?తో ఉంటోన్న అర్షదీప్ సింగ్‌ను కూడా తీసుకోవాలని భావించాను. అయితే ఓ కెప్టెన్‌గా గతంలోనే నేను పనిచేసిన శ్రేయస్ అయ్యర్ కోసం చివరి వరకూ ప్రయత్నించి దక్కించుకున్నాం. ఇక నా లిస్ట్?లో ఉన్న మూడో ప్లేయర్? చాహల్. తప్పకుండా ఈ ముగ్గురితో జట్టు బ్యాలెన్స్?డ్?గా ఉంటుందని అనుకుంటున్నా" అని రికీ తెలిపాడు.పంజాబ్ కింగ్స్ తుది జట్టు :శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), విష్ణు వినోద్, జాస్ ఇన్‌గ్లిస్, గ్లెన్ మ్యాక్స్‌వెల్, హరనూర్ పన్ను, పాయల్ అవినాష్, ప్రభుసిమ్రాన్ సింగ్, శశాంక్ సింగ్, మార్కస్ స్టొయినీస్, నేహాల్ వధేరా, మార్కో యాన్సన్, హర్‌ప్రీత్ బ్రార్, ప్రియాన్ష్ ఆర్య, అజ్మతుల్లా ఓమర్జాయ్, యశ్ ఠాకూర్, ముషీర్ ఖాన్, ఆరోన్ హార్డీ, జేవియర్, సూర్యాన్ష్ షెడ్జే, అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్, వ్యాషక్ విజయ కుమార్, లోకీ ఫెర్గ్యూసన్, కల్దీప్ సెన్, ప్రవీణ్ దుబే.



# ఆడవారిని నిందించడం ఫ్యాషన్ అయింది

**• ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్**

టీమ్ ఇండియా క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ విడిపోతున్నారంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో తరచూ వీరు వార్తల్లో నిలుస్తున్నారు. ఇటీవల వీరికి విడాకులు మంజూరైనట్టు వార్తలు వచ్చాయి. కానీ అవి నిజం కాదని.. విడాకుల వ్యవహారం ఇంకా కోర్టు పరిధిలోనే ఉందని ధనశ్రీ వర్మ లాయర్ వివరణ ఇవ్వడంతో ఆ వార్తలకు బ్రేక్ పడింది. ఇక ఆదివారం జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను చాహల్ ఓ అమ్మాయితో కలిసి వీక్షించడం ప్రస్తుతం చర్చనీయాంశమవుతోంది. ఒకవైపు దేశమంతా టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన సంబరాల్లో ఉంటే.. మరోవైపు క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ గురించి కూడా అంతే చర్చ నడుస్తోంది. దీనికి కారణం చాహల్ సోషల్ మీడియా స్టార్, రేడియో జాకీ మహవష్‌తో జంటగా కనిపించాడు. దీంతో చాహల్-వర్మ విడిపోవడానికి ఈ అమ్మాయే కారణం అని రూమర్లు మొదలయ్యాయి. స్టేడియంలో ఇద్దరూ ఉన్న ఫొటోలు, వీడియోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో ధనశ్రీ వర్మ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. మహిళలను నిందించడం ఎప్పుడూ ఫ్యాషనే అంటూ రాసుకొచ్చారు. ఈ పోస్టుకు నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. విడాకుల వార్తల విషయంలో తనపై వస్తున్న ట్రోల్స్‌కు ఆమె ఇలా స్పందించారంటూ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం ధనశ్రీ చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. చాహల్, ధనశ్రీ 2020లో వివాహం చేసుకున్నారు. కొరియోగ్రాఫర్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు ధనశ్రీ.. పెళ్లి తర్వాత వీళ్లిద్దరూ ఇన్‌స్టాలో రీల్స్ చేస్తూ ఫ్యాన్స్‌ను అలరించేవారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ జంట.. గతంలో పెట్టిన పోస్టులు అభిమానులను గందరగోళానికి గురిచేశాయి. సోషల్ మీడియాలో వీరిద్దరూ ఒకరిని ఒకరు అన్‌ఫాలో చేసుకోవడం. ధనశ్రీ తన పేరు నుంచి చాహల్ పేరును తీసేయడంతో వీరు విడాకులు తీసుకోబోతున్నారంటూ రూమర్స్ వ్యాపించాయి. అంతేకాదు ధనశ్రీ, చాహల్ జంట ఇటీవల కోర్టుకు హాజరైనట్టు కథనాలు వచ్చాయి. వీరిద్దరికి 45 నిమిషాలు పాటు కౌన్సిలింగ్ ఇచ్చిన జడ్జి విడిపోవడానికి గల కారణాలు తెలుసుకున్నారని.. పరస్పర అంగీకారంతో జడ్జి విడాకులకు ఆమోదం తెలిపినట్టు తెలిసింది. ధనశ్రీ భరణంగా రూ.60 కోట్లు డిమాండ్ చేసినట్టు వార్తలు వినిపించాయి. ఈ వార్తలపై స్పందించిన ధనశ్రీ లాయర్.. న్యాయపరమైన ప్రక్రియపై అప్పుడే మాట్లాడడం సరికాదని.. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉందన్నారు. కథనాలు రాసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని.. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకూడదని అన్నారు.






# ఐపీఎల్ ముగిసిన తరువాత టీమ్ ఇండియా బిజీ

**• దాదాపు నెలన్నర రోజులు ఇంగ్లండ్‌లో బిజీ**

**• ఇంగ్లండ్ లో టీమ్ ఇండియా పర్యటన ఖరారు**

**• జూన్ 20 నుంచి 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ మొదలు**

ఐపీఎల్ 2025 మే 25న ముగిసిన తరువాత జూన్ నెల మూడో వారం నుంచి టీమ్ ఇండియా బిజీ కానుంది. టీమ్ ఇండియా ఇంగ్లండ్ పర్యటన ఖరారైంది. ఇండియా - ఇంగ్లండ్ జట్ల మధ్య 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ జూన్ 20 నుంచి ఆగస్టు 4 వరకు జరుగుతుంది. అంటే దాదాపు నెలన్నర రోజులు ఇంగ్లండ్‌లో బిజీగా గడపనుంది. మొదటి టెస్ట్ మ్యాచ్ జూన్ 20 నుంచి 24 వరకు హెడింగ్లీలో జరగనుంది. రెండవ టెస్ట్ మ్యాచ్ జూలై 2 నుంచి 6 వరు బర్మింగ్ హామ్‌లోని ఎడ్జ్ బాస్టన్‌లో, మూడవ టెస్ట్ జూలై 10 నుంచి 14 వరకు లండన్ లార్డ్స్ మైదానంలో జరగనున్నాయి. ఇక నాలుగవ టెస్ట్ జూలై 23 నుంచి 27 వరకు మాంచెస్టర్‌లో, చివరి టెస్ట్ మ్యాచ్ జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు లండన్ కెన్నింగ్టన్ ఓవల్‌లో జరగనుంది. ఇక ఆ తరువాత అంటే ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు పూర్తిగా విశ్రాంతిలో ఉంటుంది. ఎలాంటి, ఏ విధమైన సిరీస్ ఉండదు. కాగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో లీగ్ దశ నుంచి నాకౌట్ వరకూ ఒక్క ఓటమి లేకుండా గెలుస్తూ చివరికి ట్రోఫీ సాధించింది టీమ్ ఇండియా. ప్రపంచవ్యాప్తంగా రోహిత్ సేనపై ప్రశంసలు కురుస్తున్నాయి. అటు బ్యాటర్లు, ఇటు బౌలర్లు ఫుల్ ఫామ్‌లో ఉండటంతో భారత జట్టుపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి.దుబాయ్ పాకిస్తాన్ వేదికలపై 19 రోజుల పాటు జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముగిసింది. ఇండియా విజేతగా నిలిచింది. విజేతగా స్వదేశానికి తిరిగొచ్చిన ఆటగాళ్లకు వివిధ విమానాశ్రయాల్లో భారీగా స్వాగతం లభించింది. ఇప్పుడు టీమ్ ఇండియా నెక్స్ట్ టార్గెట్ ఏంటి, ఏ సిరీస్ ఆడనుంది, ఎప్పుడు ఉంటుందని అభిమానులు చర్చించుకుంటున్నారు. వాస్తవానికి వచ్చే 4 నెలల పాటు టీమ్ ఇండియా జట్టుగా ఎలాంటి సిరీస్ ఆడటం లేదు. పూర్తిగా విశ్రాంతి మోడ్‌లో ఉంటుంది. కానీ ఎవరికి వారు వ్యక్తిగతంగా మాత్రం మరో రెండు నెలలు పూర్తిగా బిజీ కానున్నారు. మరి కొద్ది రోజుల్లో ఐపీఎల్ 2025 సీజన్ 18 ప్రారంభం కానుంది. మార్చ్ 22 నుంచి మే 5 వరకు జరగనున్న ఐపీఎల్ 2025లో టీమ్ ఇండియాలోని దాదాపు అందరు ఆటగాళ్లు పది ఫ్రాంచైజీల్లో ఉన్నవాళ్లే. అంటే టీమ్ ఇండియా ఆటగాళ్లకు మార్చ్ 22 వరకే విశ్రాంతి తీసుకోడానికి అవకాశం ఉంది. ఆ తరువాత రెండు నెలలు హెక్టిక్ షెడ్యూల్. మే 25న కోల్‌కతాలో జరిగే ఫైనల్‌తో ఐపీఎల్ ముగియనుంది. ఐపీఎల్ మొదటి మ్యాచ్ గత సీజన్ విజేత కేకేఆర్ వర్సెస్ ఆర్సీబీ మధ్య మార్చ్ 22వ తేదీన బెంగళూరులో జరగనుంది.

# సన్ రైజర్స్ అభిమానులకు బిగ్ సర్ప్రైజ్

**- సన్ రైజర్స్ కొత్త జెర్సీ విడుదల**

ఐపీఎల్ జోష్ మరికొన్ని రోజుల్లోనే మొదలవబోతోంది. టోర్నీలోని ఫ్రాంచైజీల సందడి మాములుగా లేదు. హైదరాబాద్‌కు చెందిన సన్ రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ తాజాగా అభిమానులకు బిగ్ సర్ప్రైజ్ ఇచ్చింది. ఈ సీజన్ కు గాను తమ జట్టు సభ్యులు ధరించే జెర్సీ ఫొటోలని తాజాగా విడుదల చేసింది. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఇందుకు సంబంధించిన పోస్టును రిలీజ్ చేశారు. ఈ వీడియో క్షణాల్లో వైరలైంది. కుర్రాళ్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ నూతన జెర్సీలను ధరించి, తగ్గేదేలే అన్నట్లుగా ఫోజు పెట్టారు. ఇక ఈ వీడియోపై కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో సోషల్ మీడియాను ఆరెంజ్ ఆర్మీ సభ్యులు షేక్ చేస్తున్నారు. దాదాపుగా గతేడాది ధరించిన జెర్సీలానే ఉంది. ఇక గతేడాది ధనాధన్ ఆటతీరుతో మైమరిపించిన సన్ రైజర్స్.. ఈ ఏడాది తన జట్టును మరింత పటిష్టం చేసుకుంది. కోర్ టీమ్ లోని చాలామంది ప్లేయర్లను రిటైన్ చేసుకున్న సన్.. ఈ ఏడాది ఇషాన్, మహ్మద్ షమీ, హర్షల్ పటేల్, ఆడమ్ జంపాలాంటి ప్లేయర్లను జట్టులోకి తీసుకుంది. దీంతో టీమ్ మరింత బలోపేతమైనట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతేడాది ఫటాఫట్ ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు సన్ బ్యాటర్లు. ముఖ్యంగా ఆరంభంలోనే ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ.. ప్రతి బంతిని బౌండరీకి తరలించాలని ఆడుతూ, ముచ్చెటమలు పట్టించారు. హెన్రీచ్ క్లాసెన్, నితీశ్ రెడ్డి కూడా ధనాధన్ ఆటతీరుతో ఎంతో మంది బౌలర్లకు నిద్ర లేని రాత్రుళ్లను మిగిల్చాడు. ఈ ఏడాది ఇషాన్, అభినవ్ మనోహర్ లాంటి హిట్టర్లతో బలం మరింత పెరిగింది. ఇక బౌలింగ్ లో షమీ, హర్షల్, జంపా, కెప్టెన్ పాట్ కమిన్స్ రాకతో మరింత స్ట్రాంగ్ గా మారింది. ఈనెల 23ను హైదరాబాద్ లోని ఉప్పల్ మైదానం వేదికగా తమ తొలి మ్యాచ్ ను ఆడనుంది. మ.3.30 గంటలకు మాజీ చాంపియన్ రాజస్థాన్ రాయల్స్ తో తలపడనుంది. 2016 టైటిల్ గెలిచిన సన్.. 2018, 2024లో రన్నరప్ గా నిలిచింది. దీంతో ఈసారి మరో టైటిల్ నెగ్గాలని భావిస్తోంది.





# కార్తీక్ ఆర్యన్‌తో శ్రీలీల డేటింగ్

**• కోడలుపై ఆర్యన్ తల్లి వ్యాఖ్యలపై చర్చ**

బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్ , నటి శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ గత కొన్ని రోజుల నుంచి బీటౌన్‌లో ప్రచారం జరుగుతోంది. కార్తిక్ ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. ఇదిలాఉండగా, తమ ఇంటికి ఎలాంటి అమ్మాయి కోడలిగా రావాలో తెలియజేస్తూ కార్తిక్ ఆర్యన్ తల్లి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఐఫా' వేడుకల్లో పాల్గొన్న ఆమెను నిర్మాత కరణ్‌జోహార్ కాబోయే కోడలి గురించి ప్రశ్నించారు. 'ఒక మంచి వైద్యురాలు మా ఇంటికి కోడలిగా రావాలని మేమంతా కోరుకుంటున్నాం' అని ఆమె తెలిపారు.నటిగా రాణిస్తోన్న శ్రీలీల.. ప్రస్తుతం ఎంబీబీఎస్ చదువుతోన్న విషయం తెలిసిందే. చదువుతోపాటే కెరీర్‌లోనూ కొనసాగడంపై ఎన్నో సందర్భాల్లో ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కార్తిక్ – శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ ప్రచారం జరుగుతోన్న వేళ హీరో తల్లి వ్యాఖ్యలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. శ్రీలీలను ఉద్దేశించే ఆమె ఈ వ్యాఖ్యలు చేశారని పలువురు భావిస్తున్నారు.దక్షిణాదిలో హీరోయిన్‌గా గుర్తింపుతెచ్చుకున్న శ్రీలీల.. బాలీవుడ్‌లో తన సత్తా చాటుకునేందుకు సిద్ధమయ్యారు. అనురాగ్ బసు దర్శకత్వంలో ఆమె ఓ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలో కార్తిక్ ఆర్యన్ హీరోగా నటించడం విశేషం. ఈ సినిమా చిత్రీకరణ సమయంలోనే కార్తిక్ – శ్రీలీల మధ్య పరిచయం ఏర్పడిందని.. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతమంది మాట్లాడుతున్నారు. మరికొంతమంది మాత్రం వాళ్లది కేవలం స్నేహం మాత్రమేనని.. ఆ స్నేహంతోనే ఆమెను ఆయన ఇంటికి ఆహ్వానించారని అనుకుంటున్నారు. మరోవైపు, ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారిన ఈ డేటింగ్ కథనాలపై నటీనటులు ఎక్కడా స్పందించలేదు. గత ఏడాది వరుస చిత్రాలతో బిజీగా ఉంది. అలాగే పరాజయాలు చవిచూసింది. అయినా ఆఫర్లకు కొదవేం లేదు. ఇప్పుడు కూడా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అరడజను సినిమాలున్నాయి. బాలీవుడ్ హీరో కార్తిక్ ఆర్యన్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుందనీ, డేటింగ్ చేస్తుందని వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. కార్తిక్‌తో కలిసి ఫ్యామిలీ పార్టీలో శ్రీలీల పాల్గొనడంతో ఈ వార్తలు తెరపైకి వచ్చాయి. అయితే ఈ గాసిప్పులపై శ్రీలీల ఎక్కడా స్పందించలేదు.

# నూడుల్స్ తిని కాలం వెళ్లబుచ్చాం

**- పాత జ్ఞాపకాలు నెమరేసుకున్న దియామిర్జా**



కెరీర్ బిగినింగ్‌లో సవాళ్లు ఎదుర్కోవడం ఎలాంటి ఆర్టిస్ట్‌కైనా సహజమే. ఇప్పుడు ఎంత పెద్ద స్టార్ అయినా కావచ్చు కెరీర్ బిగినింగ్‌లో ఇబ్బందులు సహజంగానే ఉంటాయి. మోడలింగ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో తాను ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నట్లు చెప్పారు నటి దియా మిర్జా. ఆ సమయంలో చేతిలో డబ్బుల్లేక ఇబ్బందిపడ్డానని ఆమె అన్నారు. '2000లో నేను, ప్రియాంకా చోప్రా, లారా దత్తా.. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొన్న విషయం అందరికీ తెలిసిందే. ప్రియాంకకు కుటుంబ సభ్యుల నుంచి ఎంతో సపోర్ట్ ఉండేది. మాకు సపోర్ట్ చేయడానికి ఎవరూ ఉండేవారు కాదు. మోడలింగ్‌లో రాణిస్తోన్న కారణంగా అప్పటికే లారా ముంబయిలో ఒక ఇరికింట్లో అద్దెకు ఉండేది. నేను ముంబయి వచ్చినప్పుడు.. ఆమె నాకెంతో సాయంగా నిలిచింది. తన రూమ్‌లో ఉండేందుకు అవకాశం కల్పించింది. చిన్న ఇల్లే అయినప్పటికీ మేమిద్దరం సర్దుకుపోయాం. ఫ్యాషన్ షోల్లో పాల్గొని.. ఖరీదైన దుస్తులు ధరించి నప్పటికీ ఒక్కోసారి చేతిలో చిల్లిగవ్వ ఉండేది కాదు. చాలీచాలని డబ్బుతోనే జీవితాన్ని కొనసాగించాం. కొన్నిసార్లు నూడుల్స్ తిని కడుపు నింపుకున్నాం. అలా చాలా రోజులు గడిపాం. మా పరిస్థితిని తలుచుకొని నవ్వుకునేవాళ్లం. ఖరీదైన దుస్తులు వేసుకున్నా.. తినేది మాత్రం నూడుల్స్ అనుకునేవాళ్లం' అని దియామిర్జా ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. 2000 మిస్ ఇండియా పోటీల్లో లారా దత్తా విజేతగా కిరీటాన్ని అందుకోగా.. ఫస్ట్ రన్నరప్‌గా ప్రియాంకా చోప్రా, సెకండ్ రన్నరప్‌గా దియా మిర్జా నిలిచారు. 2001లో విడుదలైన 'రెహ్నా హై తేరే దిల్ మే'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు దియా మిర్జా. అనంతరం ఆమె బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేశారు. 2021లో విడుదలైన 'వైల్డ్ డాగ్' సినిమాలో ఆమె నటించారు.

# సినిమా ప్రచారంలో హీరోల కొత్త పుంతలు






తెలుగు సినీ నటులు, కథానాయకులు తమ సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లడానికి దొరికిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటున్నారు. ఎంత వీలైతే అంత.. ఎన్ని రకాల దారులుంటే అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో నిర్మించినంత మాత్రాన సినిమాలు ఆడేస్తాయనుకోవడం పొరపాటు. ఈ సంక్రాంతికి విడుదలైన 'గేమ్ ఛేంజర్'లో స్టార్స్‌కు కొదవలేదు. నిర్మాణం విషయంలో రాజీపడలేదు. అయినా ప్రేక్షకుడికి నచ్చలేదు. అదే సమయంలో తక్కువ బడ్జెట్‌తో విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' కాసుల వర్షం కురిపించింది. సంక్రాంతి సందర్భంగా టెలికాస్ట్ అయిన ప్రతి టీవీ ప్రోగ్రామ్‌లో వీరిదే సందడి. అగ్ర కథానాయకుడు వెంకటేశ్ తన సినీ కెరీర్‌లో ఏ సినిమాకు చేయని రీతిలో ప్రచారం చేశారు. వేదికలపై డ్యాన్సులు వేశారు.. టీమ్‌తో కలిసి క్రికెట్ ఆడారు.. రీల్స్ చేశారు.. దానికి తోడు ప్రేక్షకులను సినిమా ఎంటర్‌టైన్ చేయడంతో బాక్సాఫీస్ వద్ద రూ.300కోట్లు వసూలు చేసింది. అది కూడా తెలుగు మూవీగా వసూళ్లు రాబట్టడం విశేషం.ప్రస్తుతం ఓటీటీలు రాజ్యమేలుతున్న సమయంలో తమ సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి యువ కథానాయకులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఏ అవకాశాన్ని వదిలి పెట్టడంలేదు. సినిమా విడుదలయ్యే వరకూ దాని గురించి మాట్లాడుకునేలా చేస్తున్నారు. నాని నిర్మాణ భాగస్వామిగా వస్తున్న చిత్రం 'కోర్ట్'. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల జరిగిన కార్యక్రమంలో 'కోర్ట్' నచ్చకపోతే నా హిట్ 3 చూడొద్దు' అని స్టేట్‌మెంట్ ఇచ్చారు. కంటెంట్‌పై ఆయనకున్న నమ్మకం అది. 'దిల్‌రుబా' కోసం కిరణ్ అబ్బవరం బైక్‌ను బహుమతిగా ఇచ్చారు. '÷ట్స్ నచ్చకపోతే నన్ను చితగ్గొట్టండి' అని నిర్మాత రవి అంటున్నారు. ప్రేక్షకుడిని థియేటర్ వరకూ రప్పించడం కంటే పెద్ద సవాల్ ఏదీ లేదిప్పుడు. అందుకు చిత్ర బృందాలు తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. అగ్ర కథానాయకులు, దర్శకుల సినిమాలకు ప్రచారం పెద్దగా అవసరం లేదు. అలాగని, వాళ్లు చూస్తూ కూర్చోరు. దర్శకుడు రాజమౌళిని తీసుకుంటే, ఆయన సినిమా మొదలైన దగ్గరి నుంచి విడుదలయ్యే వరకూ నిత్యం వార్తల్లో ఉంటుంది. సాధారణంగా రాజమౌళి సినిమా ప్రారంభానికి ముందు దాని గురించి కాస్త వివరాలు చెబుతారు. ఈసారి మహేశ్‌బాబుతో చేస్తున్న మూవీ మొదలు పెట్టిన తర్వాత ఇప్పటివరకూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇది కూడా రాజమౌళి స్టకరాటజీ అయి ఉండవచ్చు. అల్లు అర్జున్ 'పుష్ప1'కు చేసిన మిస్టేక్ 'పుష్ప2' విషయంలో చేయలేదు. చిరంజీవి, బాలకృష్ణ వంటి హీరోలు వేదికలపై సుదీర్ఘ ప్రసంగాలతో అలరిస్తారు. తమిళ హీరోలు సూర్య, కార్తి, విక్రమ్, ధనుష్, శివకార్తికేయన్ తదితరులు తమ సినిమా కోసం ఇక్కడికి వచ్చి సందడి చేస్తారు. ఎప్పుడూ ప్రచారానికి వెళ్లని నయనతార ఇటీవల 'మూకుతీ అమ్మన్ 2' పూజా కార్యక్రమానికి హాజరయ్యారు. ఇలా చెప్పుకొంటూ వెళ్తే, ప్రతి నటుడు తమ సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాడానికి శ్రమిస్తూనే కనిపిస్తారు.




# రాబిన్‌హుడ్‌లో క్రికెటర్ డేవిడ్ వార్నర్

హిట్టు ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేసుకుంటూ వెళుతున్నాడు నటుడు నితిన్. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నాడు. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. యితే సినిమాలో ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ నటించబోతున్నాడని చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. డేవిడ్ ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. అయితే రాబిన్ హుడ్ ప్రమోషన్స్‌లో డేవిడ్ వార్నర్ కూడా పాల్గొంటాడని దర్శకుడు వేణు తాజాగా తెలిపాడు. ఇక డేవిడ్ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో పాల్గొంటాడ లేదా నేరుగా ప్రీ రిలీజ్ వేడుకకు వస్తాడా అనేది తెలియాల్సి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# ఓటీటీలోకి ముఫాసా: ది లయన్ కింగ్'

హాలీవుడ్ బ్లాక్ బస్టర్ 'ముఫాసా: ది లయన్ కింగ్' ఓటీటీలోకి రాబోతుంది. తాజాగా ఈ సినిమా ఓటీటీ అప్‌డేట్‌ని ప్రకటించారు. 'ది లయన్ కింగ్' సినిమాకు ప్రీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం డిసెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా ఇండియాలోనే దాదాపు రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇక తెలుగులో ముఫాసా అనే రాజు పాత్రకు మహేశ్ బాబు డబ్బింగ్ చెప్పగా.. బాలీవుడ్ హిందీ వెర్షన్‌కి షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు. ముఫాసా కొడుకు పాత్ర అయిన సింబా పాత్రకు షారుఖ్ కొడుకు ఆర్యన్ ఖాన్ డబ్బింగ్ చెప్పాడు.ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం ఓటీటీ లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో హాట్‌స్టార్‌లో ఈ చిత్రం మార్చి 26 నుంచి తెలుగుతో పాటు ఇంగ్లీష్, హిందీ, తమిళం భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు వెల్లడించింది.

# ఇండస్ట్రీకి వచ్చి సెటిల్ కానివిరిక అండ: కిరణ్ అబ్బవరం హామీ



యువ కథనాయకుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం దిల్‌రుబా. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తుండగా.. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి నిర్మిస్తున్నారు. రుక్సర్ థిల్లాన్ కథానాయికగా నటిస్తుండగా.. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ వేడుకలో కిరణ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రీకి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుంటానని తెలిపాడు. హైదరాబాద్‌లోని కృష్ణ నగర్‌కి నేను వచ్చినప్పుడు నాతో పాటు 50 మంది ఉండేవాళ్లం. అందరం కలిసి పనిచేయాలని చెప్పి బావార్చి దగ్గర కలిసేవాళ్లం. స్టోరీలు చెప్పుకునేవాళ్లం. అయితే రోజురోజుకి మా సంఖ్య తగ్గి 50 నుంచి 10కి పడిపోయింది. ఇప్పుడయితే ఇద్దరు ముగ్గురు కూడా కనిపించట్లేదు. దీనికి కారణం ఏంటి అంటే అవకాశలు రావడం. అవకాశం వచ్చిన వాళ్లు ఇక్కడనే సెటిల్ అవుతారు. కానీ అవకాశలు రాకుండా అలానే మిగిలిపోయిన వాళ్లు ఇంటికివెళ్లిపోతున్నారు. సినిమాలు అంటే పేరెంట్స్‌కి కూడ నమ్మకం లేదు. అందుకే ఇండస్ట్రీకి వచ్చి ఇబ్బంది పడుతున్న వారికి నేను తోడుండాలి అనుకుంటున్నాను. నేను ఇప్పుడు చిన్న హీరోనే కానీ నాకు తోచినంతా సాయం చేయడం చేస్తాను. ప్రతి సంవత్సరం సినిమా అంటే పిచ్చి ఉండే 10 మంది వ్యక్తులకు నేను ఆర్థిక సాయం చేయడమే కాకుండా ఆదుకుంటాను. కొత్త వారిని ఇండస్ట్రీలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. నా సినిమాలలో కూడా కొత్తవారికి అవకాశం ఇవ్వమని నిర్మాతలను అడుగుతాను. నాకంటే టాలెంట్ ఉన్నవాళ్లు చాలమంది బయట ఉన్నారు. నాకు అవకాశం వచ్చింది. మీకు రేపు అవకాశం రావచ్చుంటూ కిరణ్ చెప్పుకోచ్చాడు.